JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజ్‌గిరి | బుధవారం 17-09-2025
Medchal - Malkajgiri | Wednesday 17-09-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 112 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 112 | Pages : 8 | ₹ : 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



# సామాన్య కార్యకర్త నుంచి.. అత్యున్నత స్థాయికి



■ నరేంద్రమోడీ 75వ పుట్టిన రోజు

జయభేరి, గాంధీనగర్, సెప్టెంబర్ 16:

ప్రపంచ యవనికపై అగ్రరాజ్యం అమెరికా విధించిన ఆంక్షలను తట్టుకుంటూ భారతదేశం సగర్వంగా తలెత్తుకుని నిలబడింది. మరిన్ని దేశాలకు ఆదర్శంగా నిలిచింది.. దీనికి కారణం భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ అని అంటారు రాజకీయ విశ్లేషకులు. ప్రస్తుతం నరేంద్ర మోడీ పేరు ప్రపంచవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోంది. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ నాయకులలో ఒకరిగా పరిగణించబడే ప్రధాని మోడీ సెప్టెంబర్ 17, 2025న తన 75వ పుట్టినరోజును జరుపుకోనున్నారు. ఒక సామాన్య ప్రచారకర్త నుంచి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆ తర్వాత దేశ ప్రధానమంత్రి వరకు ఆయన ప్రయాణం చాలా స్ఫూర్తిదాయకం.ప్రధానమంత్రి మోడీ 1950 సెప్టెంబర్ 17న గుజరాత్‌లోని వాద్‌నగర్ అనే చిన్న పట్టణంలో జన్మించారు. ఆయన బాల్యం అత్యంత పేదరికంలో గడిచింది. ఆయన తండ్రి దామోదర్‌దాస్ ముల్చంద్ మోడీతో కలిసి వాద్‌నగర్ రైల్వే స్టేషన్‌లో టీ అమ్మేవారు. ఆయన తల్లి హీరాబెన్ ఒక సాధారణ గృహిణి. నలుగురు తోబుట్టువుల్లో మూడవ సంతానం ప్రధాని మోడీ. రేపు ప్రధాని మోడీ పుట్టిన రోజు సందర్భంగా అరుదైన ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

...మిగతాది 2 లో

# మరో డిస్కం ఏర్పాటు ప్రతిపాదన

2 లో

**రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న రెండు డిస్కంలను మూడు డిస్కంలుగా పునర్విభజన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రిమండలి ఆమోదం తర్వాత మూడో డిస్కంపై ముందుకు వెళ్లాలని చెప్పారు.**

జయభేరి, హైదరాబాద్ :

ఇంధన శాఖపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లుతో కలిసి ఇంధన శాఖ, సంబంధిత శాఖల ఉన్నతాధికారుల సమావేశంలో సుదీర్ఘంగా సమీక్షించారు. మూడవ డిస్కం ఏర్పాటుకు వీలైనంత తొందరగా పూర్తిస్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని, సంబంధిత పీపీఏ అలొకేషన్, సిబ్బంది, ఆస్తుల విభజన, బకాయిలు, ఇతర అంశాలపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ TGSPDCL, నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ TGNPDCL లతో పాటు మరో డిస్కం ఏర్పాటు ప్రతిపాదనలపై ఇంధన శాఖ సిద్ధం చేసిన ప్రాథమిక ప్రణాళికను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యవసాయం, మేజర్, మైనర్ లిఫ్ట్ ఇరిగేషన్, గ్రామీణ మంచినీటి సరఫరా, జీహెచ్ఎంసీ పరిధిలో మంచినీటి సరఫరాకు సంబంధించిన విద్యుత్ వినియోగాన్ని కొత్త డిస్కం పరిధిలోకి తేవాలన్న ప్రతిపాదనలను వివరించారు. గ్రేటర్ హైదరాబాద్‌లో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబులింగ్ విధానంపై పలు ప్రతిపాదనలు, డీపీఆర్ తయారీకి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. వీటితో పాటు కోర్ అర్బన్ రీజియన్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లను ఆధునీకరించే అంశాలను తెలియజేశారు. వచ్చే రెండున్నరేళ్లలో కోర్ అర్బన్ రీజియన్‌లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# వడ్డీలేని విద్య రుణాలు



జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 16 :

ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద ఊరట కలిగించే ప్రకటన చేశారు. వడ్డీలేని విద్య రుణాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రుణాలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పావలా వడ్డీ పథకంతో అనుసంధానిస్తామని చెప్పారు. అన్ని వర్గాల విద్యార్థులకు ఇది అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ పథకం కింద రుణాల మంజూరుకు ఎటువంటి భద్రత అవసరం లేదని, 14 ఏళ్ల తర్వాత తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుందన్నారు. నైపుణ్య శిక్షణ కోర్సులకూ ఈ పథకం వర్తించనుందని పేర్కొన్నారు. విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా పావలా వడ్డీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ సందర్భంగా 'ఆడబిడ్డ నిధి' పథకాన్ని కూడా త్వరలో అమలు చేస్తామన్నారు. దీనిలో భాగంగా నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందజేయనున్నట్లు చెప్పారు. ఇది అమ్మాయిల చదువును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉండబోతుందని పేర్కొన్నారు.ఆర్టీసీ బస్‌స్టాండ్లను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టే పనిలో ప్రభుత్వం ఉన్నదన్నారు. వాణిజ్య సముదాయాలు,

...మిగతాది 2 లో

# విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

## విద్యార్థులకు గుణాత్మకమైన విద్యా బోధనను అందించాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

జయభేరి, హైదరాబాద్




విద్య వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు తెచ్చిందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం అబిడ్స్ లోని స్టాండ్లీ కాలేజీలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం 2025 సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరి చందన దాసరితో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురుబ్రహ్మ గురువిష్ణు ,గురుదేవో మహేశ్వరని జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే దక్కుతుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పు తెచ్చిందని, ప్రతి విద్యార్థికి గుణాత్మకమైన విద్య బోధన అందించే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ 5 సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటాం ఆరోజు రాష్ట్రస్థాయి కార్యక్రమాలు ఉన్నందున హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఈరోజు జరుపుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ జిల్లాలో 108 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న

...మిగతాది 2 లో

# లభ్యం కాని నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలు



■ సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు

జయభేరి, హైదరాబాద్ సెప్టెంబర్ 16:

సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లో నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి ఆచూకీ ఇప్పటికీ

...మిగతాది 2 లో

# గ్రూప్ వన్ పోస్టుకు 3 కోట్లా

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 16

గ్రూప్ 1 మెయిన్స్ పేపర్లు రీవాల్యుయేషన్ చేయాలని, లేనిపక్షంలో ఎగ్జామ్ మళ్లీ నిర్వహించాలని తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇటీవల తీర్పు వెలువరించింది. అయితే రూ.3 కోట్లు ఇచ్చి గ్రూప్ 1 ఉద్యోగాలు సాధించారని, ఇది రూ.1700 కోట్ల స్కామ్ జరిగిందని ఆరోపణలు రావడంతో ర్యాంకర్ల తల్లిదండ్రులు సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారుఓ ర్యాంకర్ తల్లి మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఏడుగురు బిడ్డలు, ఓ బాబు ఉన్నారని.. కూలీనాలి చేసుకుని వాళ్లను ప్రయోజకులు చేశానన్నారు. కొందరు పిల్లల్ని పనికి పంపించి ఒకర్ని చదివిపించి ఉద్యోగం వచ్చేందుకు కష్టపడ్డాం. పాల ప్యాకెట్‌కు పైసలు లేవంటే మీరు రూ.3 కోట్లు ఇచ్చారంటున్నారు. ఎక్కడి నుంచి తెస్తాం సార్. రూ.200, రూ.500తో పూట గడవడమే కష్టంగా ఉంది. ఒక్కడు బాగుపడితే కుటుంబాన్ని చూసుకుంటాడని ఆశలు పెట్టుకుంటే డబ్బులు ఇచ్చారని చెప్పడం సరికాదు. ఇప్పటికే రెండుసార్లు పరీక్షలు రద్దు చేశారు. మూడోసారి పిల్లల భవిష్యత్తు నాశనం చేస్తారా ? వాళ్ల ఏజ్ అయిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రూప్ 157 ర్యాంకర్ ఉదయ్ కిరణ్ తల్లి లలిత మీడియాతో మాట్లాడుతూ.. మారుమూల పల్లె నుంచి వచ్చిన వాళ్లం. అతికష్టమ్మీద పిల్లలను తెలుగు

...మిగతాది 2 లో

# RGVపై మరోసారి కేసు నమోదు

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 16:

నిత్య వివావాదాల వీరుడు, దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మరోసారి చిక్కుల్లో పడ్డారు. రిటైర్డ్ ఐపీఎస్ అంజనా సిన్హా ఆయనపై హైదరాబాద్‌లో ఫిర్యాదు చేశారు. తన అనుమతి లేకుండా తన ఐడెంటిటీని తప్పుగా ఉపయోగించారని ఆమె రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దహనం అనే వెబ్‌సిరీస్‌లో తన అనుమతి లేకుండా తన ప్రొఫెషనల్ ఐడెంటిటీని వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించారని అంజనా ఫిర్యాదులో పేర్కొన్నారు. 'దహనం' వెబ్‌సిరిస్‌కు నిర్మాత రామ్‌గోపాల్‌వర్మ, దర్శకుడు అగస్త్య మంజు.2022లో చిత్రీకరించిన దహనం వెబ్‌సిరీస్‌పై ఫిర్యాదు వచ్చింది. కథ రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో జరుగుతుంది. అప్పట్లో అంజనా సిన్హా అక్కడ వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె వృత్తిపరమైన ఐడెంటిటీని దహనం వెబ్‌సిరీస్‌లో ఉపయోగించారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న అంజనా సిన్హా ఇప్పుడు ఫిర్యాదు చేశారు. 1990 బ్యాచ్‌కు చెందిన అంజన తెలుగు రాష్ట్రాల్లో ADGP హోదా వరకూ ఉన్నారు. రాయలసీమలో ఎస్పీగా, DIGగా పనిచేశారు. "ఓ స్నేహితుడి ద్వారా నాకు ఈ విషయం కాస్త ఆలస్యంగా తెలిసింది నేను నిర్మాత, దర్శకుడిని ఎప్పుడూ కలవలేదు. మాట్లాడలేదు. ఎలాంటి అనుమతి కూడా ఇవ్వలేదు. నా పేరుతో, నా ప్రొఫెషనల్ ఐడెంటిటీతో ఈ సిరీస్‌ను నరేట్ చేసినట్లు చూపించడం ద్వారా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేశారు.ఈ సిరిస్ మొత్తం హింసాత్మక దృశ్యాలు,

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## మరో డిస్కం ఏర్పాటు ప్రతిపాదన

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. కోర్ అర్బన్ రీజియన్‌లో ఎక్కడెక్కడ కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందో గుర్తించాలి. ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా లోడ్ రీప్లేస్మెంట్ చర్యలు చేపట్టాలి. సబ్ స్టేషన్ సామర్థ్యంకన్నా ఒక్క కనెక్షన్ కూడా ఎక్కువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరమైన చోట సబ్ స్టేషన్ సామర్థ్యాన్ని పెంచుకోవాలి. విద్యుత్ సబ్ స్టేషన్‌లలో అధునాతన సాంకేతికతను ఉపయోగించాలి. విద్యుత్ కేబుళ్లతో పాటు ఇతర కేబుళ్లు సైతం అండర్ గ్రౌండ్ వ్యవస్థను ఉపయోగించుకునేలా ఉండాలి. దీనిపై బెంగుళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లో అండర్ గ్రౌండ్ కేబులింగ్ ప్రాజెక్టులను అధ్యయనం చేయాలి. వచ్చే డిసెంబర్‌లోగా ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాలి.

## RGVపై మరోసారి కేసు నమోదు

సెక్సువల్ కంటెంట్ ఉంది. " అని ఫిర్యాదులో పేర్కొన్నారు. అభ్యంతరకరమైన వెబ్‌సిరీస్‌లో తన ఐడెంటిటీని వాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవి తన ప్రతిష్ట, గౌరవం, ప్రొఫెషనల్ స్టాండింగ్‌కు తీవ్ర నష్టం కలిగించాయని పేర్కొన్నారు. తన వ్యక్తిగత హక్కులకు భంగం వాటిల్లిందని, మానసికంగానూ కలత చెందినట్లు తెలిపారు. "ధహనం" 2022లో ఎంఎక్స్ ప్లేయర్లో విడుదలైంది. అయితే తరువాత ప్లాట్‌ఫాం నుండి తొలిగించారు. ఈ వెబ్ సిరీస్‌ను రామ్ గోపాల్ వర్మ నిర్మించగా, అగస్త్య మంజు దర్శకత్వం వహించారు. అభిషేక్ దూహన్, ఇషా కోప్పికర్ ముఖ్య పాత్రల్లో నటించారు. మొత్తం ఏడు ఎపిసోడ్లుగా రూపొందిన ఈ సిరీస్, ఒక కమ్యూనిస్ట్ కార్మికుడి హత్య అనంతరం ప్రతీకార కథ చుట్టూ తిరుగుతుంది.ఈ ఫిర్యాదు ఆధారంగా రాయదుర్గం పోలీసులు సెప్టెంబర్ 10న నిర్మాత, దర్శకుడిపై ఐపీసీ సెక్షన్లు 509, 468, 469, 500, 120(B) కింద కేసు నమోదు చేశారు.రామ్‌గోపాల్‌వర్మకు ఇలాంటి కేసులు కొత్త కాదు. ఇంతకు ముందు కూడా ఆయన సినిమాలు చాలాసార్లు వివాదాల్లో చిక్కుకున్నాయి. సినిమాల ద్వారా ట్వీట్ల ద్వారా ప్రతి ఒక్కరికి కెలికి ఆనందపడే RGVపై చాలా కేసులే ఉన్నాయి. ఏపీలో జగన్ ప్రభుత్వం ఉన్న సమయంలో తెలుగుదేశాన్ని రెచ్చగొట్టేలా సోషల్‌మీడియా పోస్టులు, చంద్రబాబు, లోకేష్‌లను కించపరిచేలా సినిమాలు తీశారాయన. వాటిపై ఏపీలో ప్రభుత్వం మారిన తర్వాత ఫిర్యాదులు వచ్చాయి. చంద్రబాబు, లోకేష్‌లను అనుచితంగా చూపించారంటూ వచ్చిన ఫిర్యాదులపై ప్రకాశం జిల్లాలో కేసు నమోదైంది. అంతకు ముందు ఆయనపై చెక్‌బౌన్స్, కాపీరైట్ కేసులు కూడా ఉన్నాయి.

## గ్రూప్ వన్ పోస్టుకు 3 కోట్లా

మీడియం నుంచి ఇంగ్లీష్‌మీడియం చదువులు చెప్పించాం. గత మూడేళ్లుగా దసరా పండుగలకు మా అబ్బాయి ఇంటికి కూడా రాకుండా ప్రిపేర్ అయ్యాడు. కోచింగ్ సెంటర్లో ఉండి ఎంతో పట్టుదలతో చదివి గ్రూప్ 1 ర్యాంక్ సాధించాడు. గతంలో పరీక్షలు నిర్వహించి రద్దు చేసినా, మానసికంగా సిద్ధమై మళ్లీ ఉద్యోగం సాధించాడు. ప్రతిసారి జాబ్స్ ఫలితాలపై దుష్ప్రచారం జరుగుతోంది. ప్రిలిమ్స్, మెయిన్స్ ఫలితాల తరువాత సైలెంట్ గా ఉన్న వాళ్లు ఇప్పుడు గ్రూప్ 1 పోస్టులకు ఎంపికైన తరువాత అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆరోపణలు చేస్తున్నారు. కష్టపడి చదివించారు. ఈ బాబును చూసి నేర్చుకోవాలి అని స్థానికంగా చెబుతుంటారు. జాబ్ తెచ్చుకుని కుర్చీలో కూర్చోక ముందే ఉద్యోగాన్ని లాగేసుకుంటున్నారు. మళ్లీ పరీక్షలు నిర్వహించడం అంటే కింద పడిన అన్నాన్ని మళ్లీ తీసుకుని తినడమే. మళ్లీ ఎగ్జామ్ రాస్తే ఎంపికైనా అది కరెక్ట్ అన్న నమ్మకం ఎవరికైనా ఉంటుందా. రూ.3 కోట్లు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. కనీసం రూ.30 లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ ఉన్నవాళ్లు, అంత డబ్బు చూసిన వాళ్లు ఇక్కడ లేరు. ర్యాంక్ తెచ్చుకుని మా బాబు రోడ్డున పడినట్లుగా పరిస్థితి ఉంది. మరో ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ.. ఫలితాలు వచ్చి జాబ్ ఎక్కకముందే గ్రూప్ 1 ర్యాంకర్లపై అసత్యాలు ప్రచారం చేయడం సరికాదు. కోచింగ్ లేకుండా బుక్స్ చదివి జాబ్ తెచ్చుకున్న వారిని డబ్బులతో జాబ్ కొన్నారని ఆరోపించడం ఎంతవరకు సమంజసం. ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించి తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకోవాలన్నారు.కోదాడ పక్కన పల్లెటూరు నుంచి ర్యాంకర్ తల్లి సీత కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పంపి పిల్లల్ని చదివించాను. నా కూతురు కష్టపడి చదివి జాబ్ తెచ్చుకుంటే రూ.3 కోట్లు ఆరోపణలతో జీవితాలు నాశనం చేస్తున్నారు. మాకు ఎవరూ పెద్దలు తెలవదు, రికమండేషన్లు చేయలేం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలని కోరారు. మరో ర్యాంకర్ తల్లి మాట్లాడుతూ.. కష్టపడి గ్రూప్ 1 ర్యాంక్ తెచ్చుకుంటే అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. చదువుకున్న రాజకీయ నాయకులు కూడా చదువుకోని వాళ్లలాగ మాట్లాడుతున్నారు. పిల్లల భవిష్యత్ ఏమవుతుందని తల్లిదండ్రులు ఎంతో ఆందోళన చెందుతున్నారు. జాబ్ సాధించిన వాళ్లను తప్పు చేసినవాళ్లుగా చిత్రీకరిస్తున్నారు.

## వడ్డీలేని విద్య రుణాలు

కార్గో సేవలు, ప్రకటనల ద్వారా ఆర్టీసీ ఆదాయాన్ని పెంచేందుకు కూడా ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. దేవుడి దయతో అన్ని బస్సులు ఏసీ బస్సులుగా మారే రోజులు దూరంలో లేవన్నారు.త్వరలో శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలను అందించనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. శ్మశాన వాటికల కోసం అవసరమైన స్థలాల కేటాయింపును కలెక్టర్లు ప్రాధాన్యంగా తీసుకోవాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకాన్ని కూడా అమలు చేస్తామని చెప్పారు.రాష్ట్రంలోని రజకుల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 25 మందికి మించి ఉన్న ప్రతి చోట ఆధునిక ధోబీఘాట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇస్త్రీ చేసుకునే కోసం షెడ్లు, సోలార్ లేదా విద్యుత్తుతో నడిచే తోపుడు బండ్లు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వడ్డెరుల కోసం క్వారీల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకుంటామన్నారు.రాష్ట్రంలో త్వరలోనే యూనివర్సల్ హెల్త్‌కార్డ్ అమలులోకి రానుంది. డిజిటల్ కార్డుల రూపంలో ఇది అందుబాటులోకి రానుందని ఏపీ సీఎం వెల్లడించారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల కేవైసీ సమస్యలను పూర్తిగా పరిష్కరించాలన్నారు. ప్రతి జిల్లాలో యువతకు ఉపాధి కల్పించేలా జాబ్ మేళాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రైస్తవులకు సంబంధించిన చర్చిల నిర్మాణానికి మరియు మరమ్మతులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. జెరూసలేం యాత్రికులకు కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. క్రైస్తవ ఆస్తుల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసే అంశంపై చర్చ జరిపి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. విజయవాడ హజ్‌హౌస్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. మసీదుల నిర్వహణ కోసం ప్రతి మసీదుకు రూ.5,000 ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు చంద్రబాబు తెలిపారు.సుప్రీంకోర్టు జీవో 3ను కొట్టేసిన నేపథ్యంలో, గిరిజనుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం త్వరలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనుందని సీఎం చెప్పారు. వారికి న్యాయం జరిగేలా ముందడుగు వేస్తామని హామీ ఇచ్చారు. గతంలో వ్యాపారాల విషయంలో భయపడిన ఆర్యవైశ్యులకు అనువైన వాతావరణాన్ని కల్పించామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మత్స్యకారులకు సీవీడ్ సాగుతో మంచి జీవనోపాధిని కల్పించేందుకు ప్రత్యేక శాఖ ఏర్పాటుపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ తీసుకున్న మోడల్‌ను ఇతర కార్పొరేషన్లు కూడా అనుసరించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రభుత్వ నిధులను కార్పస్ ఫండ్‌గా నిలుపుకొని, దాతల సహాయంతో శాశ్వత ఆదాయాన్ని సృష్టించడం, ఆస్తుల సేకరణ వంటి మోడల్ సరైనదని చెప్పారు. కమ్యూనిటీ లీడర్లను భాగస్వాములుగా మార్చిన తీరు అభినందనీయం అన్నారు.

## లభ్యం కాని.. ముగ్గురి మృతదేహాలు

లభ్యం కాకపోవడంతో.. మున్సిపల్ మంత్రిగా ఉండి రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నట్టు అని కేటీఆర్ నిలదీశారు.మీ కాంగ్రెస్ సర్కారు ఘోర తప్పిదం వల్ల ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలి మరణించిన ఆరుగురి మృతదేహాలను బయటకు తీయలేక చేతులెత్తేశావు. చివరికి హైదరాబాద్‌లో నాలాలో కొట్టుకుపోయిన ముగ్గురి పార్థివదేహాలను మూడురోజులైనా గుర్తించలేవా..? ఇంతకన్నా అసమర్థతత, చేతకానితనం, పరిపాలనా వైఫల్యం ఇంకోటి ఉంటదా..?? కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత, మానవత్వం లేని కాంగ్రెస్‌కు వినిపించడం లేదా ? అని కేటీఆర్ ప్రశ్నించారు.చిన్న పాటి వర్షానికే పొంగిపొర్లుతున్న నాలాలు, చివరికి ప్రజల ప్రాణాలు హరిస్తుంటే మున్సిపల్ మంత్రిగా కూడా ఉండి ఏం చేస్తున్నట్టు ? విపత్కర పరిస్థితుల్లో ప్రజల కష్టాలు తీర్చేందుకు ఏర్పాటుచేసిన డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ను కూడా నిర్వీర్యం చేయడం వల్లే ఈ దుస్థితి. ఎస్ఎల్బీసీ సొరంగంలో ఆరుగురిని సజీవ సమాధి చేసి ఇప్పటికే మహాపాపం మూటగట్టుకున్నారు..నాలాల్లో బలిచేసిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# మణిపూర్ లో మార్పు సాధ్యమేనా..?

**మణిపూర్‌లో కుకీ, మైతీ తెగల మధ్య రెండేళ్లుగా సాగుతున్న ఘర్షణ నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రెండు తెగల మధ్య ఘర్షణ కారణంగా అల్లర్లు చెలరేగిన తర్వాత మోదీ మణిపూర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మణిపూర్‌లో తిరిగి శాంతిని నెలకొల్పేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని మోదీ చెప్పడం ముదావహం. అల్లర్లలో అట్టుడికిన మణిపూర్‌లో రెండేళ్ల తరువాత పర్యటిస్తున్న ప్రధాని మోదీకి తమ గోడును వెళ్లబోసుకున్నారు స్థానికులు.**



అల్లర్ల కారణంగా సర్వం కోల్పోయామని ప్రధానికి వెల్లడించారు బాధితులు. స్కూళ్లు మూతపడడంతో విద్యకు దూరమయ్యామని చిన్నారులు ప్రధాని మోదీ ముందు కంటతడి పెట్టారు. చిన్నారుల బాధను చూసి మోదీ చలించిపోయారు.. మణిపూర్ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని , మోదీ మీకు అండగా ఉంటాడని వాళ్లను భరోసా ఇచ్చారు. శాంతి తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మణిపూర్ ప్రజలకు కేంద్రం అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు మోదీ.కుకీలు ఎక్కువగా ఉండే చురాచంద్‌పూర్, అలాగే మైతీలు ఎక్కువగా ఉండే ఇంఫాల్‌లో నిర్వహించిన బహిరంగ సభల్లో మాట్లాడారు. తొలుత చురాచంద్‌పూర్‌లో 7,300 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, తర్వాత ఇంఫాల్‌లో 1,200 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇంఫాల్, చురాచంద్‌పూర్ సభలు పరిశీలించి చూస్తే.. మ ణిపూర్‌లో శాంతి చేకూరాలన్న మాటలు మోదీ నోట వినిపించాయి. నిత్యం ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్‌ను మళ్లీ శాంతికి, అభివృద్ధికి చిహ్నంగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మోదీ స్పష్టం చే శారు. రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారిని ఆదుకుంటామని ప్రధాని సభా వేదికగా ప్రకటించారు. రూ. 7వేల కొత్త ఇండ్లను కట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక సాయం అందిస్తున్నట్టు పే ర్కొన్నారు.అంతేకాదు కేంద్రం ఇటీవలే రూ.3 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీకి ఆమోదం తెలిపిందని.. ఇందులో నిరాశ్రయుల కోసమే ప్రత్యేకంగా 500 కోట్లు కేటాయించామని తెలిపారు. మొత్తంగా చూసుకుంటే మణిపూర్ బాధితులను ఆదుకునేందుకు, శాంతిని నెలకొల్పేందుకు, అభివృద్ధి ప నులు సక్రమంగా జరిగేందుకు కేంద్రం అన్ని విధాలుగా రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తుందని భరోసానివ్వడం కొత్త ఆశలను చిగురించేలా చేస్తోంది.అయితే మోదీ పర్యటనకు ముందే మణిపూర్‌లో ప్రాదేశిక సమగ్రతకు భంగం వాటిల్లకుండా శాశ్వత శాంతి, స్థిరత్వాన్ని తీసుకురావడానికి చర్చల పరిష్కారం అవసరమని కుకీ తిరుగుబాటు గ్రూపులు, కేంద్ర ప్రభుత్వం భావించాయి. సెప్టెంబర్ 4న ఢిల్లీలో జరిగిన త్రైపాక్షిక సమీక్షా సమావేశంలో మణిపూర్‌లోని కీలకమైన జాతీయ రహదారి తిరిగి తెరిచేందుకు కుకీలు అంగీకరించారు.రాష్ట్రానికి జీవనాధారామైన ఈ జాతీయ రహదారిని ప్రయాణికులు, సరుకు రవాణా కోసం తెరిచేందుకు కుకీ, జో తెగలు నిర్ణయం తీసుకున్నాయి. మ ణిపూర్‌లోని రెండు డజన్లకు పైగా ఉన్న కుకీ, జో, హ్మార్ తిరుగుబాటు గ్రూపులకు చెందిన రెండు సంయుక్త సంస్థలతో వివాదాస్పదమైన సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ (ఎస్ఎస్‌వో) ఒప్పందాన్ని పునరుద్ధరించడం మ ణిపూర్‌లో శాంతికి ఊతం కల్పించినట్లయిందిరెండేళ్ల క్రితం మైతీలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న రాష్ట్ర హైకోర్టు ప్రతిపాదనను కుకీలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఈ అల్లర్లలో ఇప్పటివరకు 260 మందికి పైగా మరణించగా.. 40 వేల మంది కుకీలు, 20 వేల మంది మైతీలు నిరాశ్రయులయ్యారు.ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రాష్ట్రపతి పాలనలో మగ్గుతున్న మణిపూర్‌లో రెండేళ్ల తర్వాత మోదీ పర్యటించడాన్ని విపక్షాలు తీవ్రంగా తప్పుబట్టాయి. సందేశాలు మాత్రమే గాయాలను మాన్పలేవు. వేళ్ళూనుకొని ఉన్న వైరాలు ఒక చిన్న నిప్పురవ్వతో మారణకాండకు దారితీస్తున్న తరుణంలో, వైషమ్యాలను, అపనమ్మకాలను నిర్మూలించడానికి ఒక నిరంతర సానుకూల చర్యలు అవశ్యం. మొన్నటిదాకా ఒకరినొకరు చంపుకున్న వారంతా ఇకపై ఒక్కటి కావాలన్న ఆకాంక్ష మంచిదే కానీ, అందుకు బాటలు వేయాల్సిన బాధ్యత పాలకులదే. 29 నెలల నిరంతర అగ్గికి ప్రజలే కారణమన్నట్టుగా, మార్పు వారిలోనే రావాలన్నట్టుగా వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇక్కడ అగ్గిరేగింది అభివృద్ధికోసం కాదు. అప్పటికే కుకీజోలకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ పలు కక్షపూరితమై నిర్ణయాలు చేయడం, మీతీలకు ఎస్టీ రిజర్వేషన్ ఇచ్చే ప్రతిపాదనకు రాష్ట్ర హైకోర్టు సానుకూలంగా స్పందించడం కుకీల ఆగ్రహానికి కారణం. వారు నిరసన చేపడితే, మీతీలు దాడులు చేసి పరిస్థితిని ఉద్రిక్తంగా మార్చేశారు. హింస దురదృష్టకరమని ప్రధాని అనడం బాగుంది కానీ, అది దురుద్దేశపూరితమైనదని ఆయనకు తెలియకపోదు. భావితరాలకు ద్రోహం చేసింది ప్రజలు కాదు, తమవారేననీ ఆయనకు తెలుసు. నిప్పంటుకున్న క్షణం నుంచి మీతీ బీరేన్ దానిని ఆర్పడానికి ప్రయత్నించకపోగా, తన చర్యలు, చేష్టలతో మరింత ఎగదోశాడనడానికి సుప్రీంకోర్టుకు చేరిన ఆడియో టేపులే నిదర్శనం. చివరకు తీవ్రవాద గ్రూపులు సైతం తమను తాము ప్రజారక్షకులుగా అభివర్ణించుకుంటూ రంగంలోకి దిగి, ఎదుటి తెగవారిని ఊచకోతకోసే పరిస్థితులు దాపురించాయి. పోలీసుల ఆయుధాలు విద్రోహుల చేతుల్లోకి పోయాయి. మీతీ బీరేన్‌ను తప్పించనంతవరకూ శాంతిసాధ్యం కాదని తెలిసికూడా ఢిల్లీ పెద్దలు ఆయనను అడ్డగోలుగా సమర్థించారు, పాపంలో తామూ భాగస్వాములైనారు. సర్కారు ఇక కూలిపోక తప్పదన్న ఆఖరుక్షణంలో మాత్రమే బీరేన్‌ను తప్పించి, రాష్ట్రపతిపాలన ద్వారా రాష్ట్రం చేజారిపోకుండా చూసుకున్నారు. అడపాదడపా అగ్గిరేగుతున్నప్పటికీ, మొత్తంగా ఇప్పుడు పరిస్థితులు కాస్తంత గాడినపడిన మాట నిజం. కుకీ–మీతీ పెద్దల మధ్య వరుస చర్చలతో అవిశ్వాసం తొలగి, సయోధ్య సాధించాలి. తరతమభేదాలకు అతీతంగా పునరావాసం దక్కాలి. ఆప్తులను కోల్పోయినవారికి అన్నివిధాలా న్యాయం జరగాలి. మణిపూర్ మీద పార్లమెంటులో నోరువిప్పడానికీ, కుకీ స్త్రీలపై అత్యాచారాలను నేరుగా ప్రస్తావించి ఖండించడానికి గతంలో మనసొప్పని ప్రధాని ఇంతకాలానికి జరిపిన ఈ పర్యటన శాంతికి బాటలు వేయాలి. అయితే ప్రధాని తాజా పర్యటన మాత్రం మణిపూర్ మార్పుకు ఒక ఆశాకిరణంలా కనిపిస్తోంది.

## సామాన్య కార్యకర్త నుంచి.. అత్యున్నత స్థాయికి

ప్రధానమంత్రి మోడీ చిన్నప్పటి నుంచి చాలా ఆశయంతో ఉండేవారని.. దేశానికి ఏదైనా సేవ చేయాలనే కల కనే వారని మోడీ పాఠశాల స్నేహితులు చెబుతున్నారు. ఆయనకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. పాఠశాలలో చర్చా పోటీల్లో పాల్గొనేవారు. స్థానిక లైబ్రరీలో గంటల తరబడి చదువుతూ గడిపేవారు. ఆయనకు చిన్నప్పటి నుంచి ఈత కొట్టడం కూడా ఇష్టం.భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో కూడా ప్రధానమంత్రి ప్రజాదరణ పెరిగింది. ఈ ఏడాది జూలైలో విడుదలైన ఆమోద రేటింగ్ జాబితాలో డెమోక్రటిక్ నాయకుడు అగ్రస్థానంలో నిలిచారు. గత 11 సంవత్సరాలలో ప్రధానమంత్రి మోడీ అనేక జాతీయ, అంతర్జాతీయ వేదికలపై దేశాన్ని సగర్వంగా నిలబెట్టారు. నరేంద్ర మోడీ జీవిత కథ.. పోరాటం, అంకితభావం స్ఫూర్తిదాయకమైన గాథ అని చెప్పవచ్చు. ఆయన తన అసాధారణ నాయకత్వం, గొప్ప వ్యక్తిత్వంతో భారతదేశానికి కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడు. ఆయన నాయకత్వ సామర్థ్యం, దార్శనికత ,ప్రజా మద్దతు ఆయనను ప్రభావవంతమైన నాయకుడిగా మార్చాయి. తన నిర్ణయాలకు కట్టుబడి ఉండి.. తన లక్ష్యాలను సాధించడానికి కష్టపడి పనిచేసే బలమైన నాయకుడు. ఆయన నాయకత్వ సామర్థ్యం ఆయన్ని మన దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన నాయకులలో ఒకరిగా నిలబెట్టిందిప్రధానమంత్రి భారతదేశ భవిష్యత్తు గురించి శ్రద్ధ వహించే దార్శనిక నాయకుడు.

ఆయన అనేక ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రారంభించారు. వీటిలో స్వచ్ఛ భారత్ అభియాన్, డిజిటల్ ఇండియా , మేక్ ఇన్ ఇండియా మొదలైనవి ఉన్నాయి. ఇవి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి సహాయపడుతున్నాడు. ప్రజల నుంచి లభిస్తున్న విస్తృత మద్దతు, ప్రజాదరణ, ఆయన వ్యక్తిత్వ అఖండ ప్రభావం ఆయనను దృఢ సంకల్పం కలిగిన నాయకుడిగా మార్చాయి. కష్టమైన నిర్ణయాలను కూడా సులభంగా అమలు చేయగల నేర్పరి తనం ఆయన సొంతం. నరేంద్ర మోడీ నాయకత్వ సామర్థ్యం, దార్శనికత .. ప్రజా మద్దతు ఫలితంగానే అని చెప్పవచ్చు. ఆయన తన జీవితంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. తన ప్రయాణంలో ఎదురైన ప్రతి సవాల్ ను ఆయన అధిగమించారు. ఈ లక్షణం మోడీ దృఢ సంకల్పానికి అద్దంగా నిలుస్తుంది.చిన్న వయసులోనే ఇంటిని వదిలి ప్రజా జీవితంలోకి ప్రవేశించిన నరేంద్ర మోడీ తన జీవితాంతం నిస్వార్థంగా దేశ సేవలోనే గడిపారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశంగా అగ్రస్థానంలో ఉన్న మన దేశాన్ని అభివృద్ధి బాటలో పయనించే విధంగా అనేక సంస్కరణలు చేపట్టారు. మన దేశంలో మాత్రమే కాదు ప్రపంచంలోని అగ్ర నాయకులు కూడా మోడీ నాయకత్వాన్ని ప్రశంసల వర్షంతో నింపేస్తున్న సంగతి తెలిసిందే.

## విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు

వారందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ పురస్కారం నిరంతర శ్రమకి, అంకిత భావానికి దక్కిన గుర్తింపు మాత్రమేనని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాలోని పాఠాలు చెప్పే యంత్రాలు కాదు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని అన్నారు. విద్యార్థులలో జ్ఞానాన్ని నైతిక విలువలను క్రమశిక్షణ నింపి వారిని ఉత్తమ పౌరులుగా మార్చే మహోన్నతమైన బాధ్యత ఉపాధ్యాయులకే ఉంటుందని అన్నారు. విద్యార్థులే దేశ సంపద అని తరగతి గదిలో దేశ భవిష్యత్తు ఉన్నందున మీరు నాటే జ్ఞానబీజాలే రేపటి సమాజానికి ఫలాలను ఇచ్చే మహా వృక్షాలుగా విద్యార్థులు ఎదుగుతారని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం ఐటీ ఫార్మా రంగాలకే కాదని విద్య రంగానికి కూడా రాజధాని గా విలసిల్లుతుందని అన్నారు. జిల్లా అక్షర శాతం 83 కి పైగా ఉండడం మనందరికీ గర్వకరణమని అన్నారు. జిల్లాలో 2300 పైగా పాఠశాలలు ఉన్నాయి 690 ప్రభుత్వ పాఠశాలలో సుమారు లక్ష మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారాని అలాగే 5 వేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యా బోధన అందిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం డ్రాప్టన్ పూర్తిగా నివారించడం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం మన ముందున్న లక్ష్యమని ఈ లక్ష్య సాధనలో మీ అందరి భాగస్వామ్యం అత్యంత కీలకమని గుర్తు చేశారు. ప్రజాపాలన ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు కంకణం కట్టుకున్నామని స్పష్టం చేశారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల ప్రోగ్రాం కింద పాఠశాల మరమ్మత్తులు చేయడం, డిజిటల్ తరగతి గదులు, ఏఐ పాఠాలు, యంగ్ ఇండియా ప్రభుత్వ పాఠశాలలు వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని అన్నారు.

**తల్లిదండ్రులతో సమానంగా గౌరవించబడే వృత్తి లో ఉన్న ఉపాధ్యాయులు**

రాబోయే సమాజాన్ని తయారు చేసే బాధ్యతను ముందుకు తీసుకెళుతున్న మీ అందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. మరింత గురుతర బాధ్యత అనే అంశాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మనం జ్ఞాపకం చేసుకోవడమే ఉపాధ్యాయ దినోత్సవమని మంత్రి స్పష్టం చేశారు. గతంలో పేదలకు ఇవ్వడానికి భూములు ఆర్థికంగా సహకరించడానికి భూములు ఉండే ఇప్పుడు సమాజానికి ఇవ్వడానికి అభివృద్ధికి ఉపయోగపడేది ఒకేఒకటి విద్య మాత్రమే అని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన నామోషి కాదని విద్యార్థులందరినీ విశ్వాసం కల్పిస్తూ పుణాత్మకమైన విద్య అందించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడానికి మీరే వారదులని మంత్రి స్పష్టం చేశారు.

అత్యున్నత ప్రతిభ కలిగి, ఉన్నత చదువులు చదివి ఎన్నో పరీక్షలు రాసి ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చారని ఇండస్ట్రీ, ఐటి, మెడికల్ రంగంలోనైనా ప్రైవేట్ ఆధిపత్యం నడిచిన విద్య వ్యవస్థలో పూర్తిస్థాయిలో క్వాలిఫైడ్ ఉన్నప్పటికీ మిమ్మల్ని డామినేట్ చేసే విధంగా ప్రైవేట్ వ్యవస్థ వస్తుందని ఉపాధ్యాయులందరూ పునరాలోచన చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, ఫ్రీ విద్యుత్, ఫ్రీ వాటర్, బుక్స్,ఉపాధ్యాయ నియామకాలు, ప్రమోషన్ల అన్ని రకాల మౌలిక వసతుల కల్పన కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంటే నామూషి కాదు ఇటీవల కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఉండటం గర్వకారణమని అన్నారు. ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సర్వేపల్లి రాధాకృష్ణని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆయన స్ఫూర్తితో మీరు అవార్డులు తీసుకుంటున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

నేను ముఖ్యమంత్రి సిఎస్, డిజిపి, ఇతర ఉన్నతాధికారులు అందరు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి వచ్చిన వాళ్ళమేనని అన్నారు. పిల్లల మంచి విద్య అందిస్తే వారు దేశ సంపద సృష్టించడమంటే యువతకు మంచి మార్గదర్శకం అవుతుందని అన్నారు. విద్యా బోధన మొత్తం డిజిటలైజేషన్ అవుతుందని పిల్లలకు అర్థమయ్యే విధంగా విద్యా బోధన మారాలని సూచించారు. దేశానికి రాష్ట్రానికి విద్యార్థులు మార్గదర్శకులుగా మారాలి పాఠశాలలో సదుపాయాలు కల్పించే బాధ్యత ప్రభుత్వాన్ని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి మాట్లాడుతూ. మొదటి గురువు తల్లిదండ్రులు, తరువాత ఉపాధ్యాయులేనని విద్యా రంగంలో ప్రభుత్వం సమూల మార్పులు తేవటం జరిగిందని, మౌలిక వస్తువులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ఏఐ పై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించడం జరిగిందని హైదరాబాద్ జిల్లాను ఉత్తీర్ణత శాతంలో ముందు ఉంచాలని తెలుపుతూ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు. జిల్లాలో ఎంపికైన 108 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ప్రశంస పత్రాలు, మెమెంటోస్ ఈ సందర్భంగా అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు, ఉత్తమ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఒడి.. సర్కారు బడి..
# విద్య వైద్యం కల్మషం అయిపోయాయి

- సర్కారు బడి గొప్పతనాన్ని తెలియజేసిన పలువురు వక్తలు...
- విద్య, వైద్యం, వ్యవసాయం ఈ మూడు అందిన నాడే మానవ అభివృద్ధి చెందుతుంది.
- భవిష్యత్తు రేపటి విద్యార్థులదే...
- బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన చదువులమ్మ చైతన్య యాత్రలో పలువురు వక్తల అభిప్రాయాలు తెలంగాణ సమాజాన్ని ఆలోచింపజేశాయి.



**జయభేరి, హైదరాబాద్ :**

బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో అట్టహాసంగా చదువులమ్మ చైతన్య యాత్రకొనసాగింది. ఈ కార్యక్రమాన్ని సీనియర్ జర్నలిస్ట్ బాలు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నక్క శ్రీనివాస్ యాదవ్ సామాజిక సేవకులు, మాజీ రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, మాజీ ఎంపీ మధు యాష్కి గౌడ్, ప్రముఖ తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్ సిరిమల్లె విష్ణు కిషోర్, సినిమా స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎల్ ఎం ప్రేమ్, పాటల రచయిత బాలుతో పాటు ఈ పాటలను సంగీతం సమకూర్చిన శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఈ కార్యక్రమాన్ని జయభేరి సీనియర్ ప్రతినిధి కడారి శ్రీనివాస్, బాలు ఇద్దరు కలిసి 30 నిమిషాలు చిట్ చాట్ కార్యక్రమం చదువులమ్మ చైతన్య యాత్ర కార్యక్రమాన్ని ముందుకు నడిపించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఒక దేశాన్ని నాశనం చేయాలనుకుంటే ఆ దేశం యొక్క విద్య పునాదుల మీద దెబ్బ కొడితే చాలు ఆ దేశ భవిష్యత్తు అంధకారంలో పడిపోతుంది. అన్న మాటలు తెలంగాణ సమాజాన్ని ఆలోచింప చేయాలని కోరారు. చదువు కోసం చైతన్య యాత్ర అనే శీర్షికతో బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో గౌరవ అతిథిగా హాజరైన చిరంజీవులు ఐఏఎస్ మాట్లాడుతూ.. విద్య ఒక దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది అంటూ 2009లో విద్య హక్కు చట్టం వచ్చిన అది నీరు గారి పోతుంది అంటూ అసహనాన్ని వ్యక్తం చేశారు. 2018లో ప్రవేట్ విద్యా హక్కు చట్టం వచ్చింది. దీంతో 19 ప్రైవేట్ యూనివర్సిటీలు, 17 గవర్నమెంట్ యూనివర్సిటీలు నెలకొన్నాయని కేవలం ఇవి పాలక ప్రతిపక్ష వర్గానికి చెందిన లీడర్లకు చెందినవేనని ఆయన ఎద్దేవా చేశారు. ఆధిపత్య కులాలే, పెత్తందారి వ్యవస్థ మూలాలే నేటికీ విద్య వ్యవస్థను బందీ చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన నల్లగొండ జిల్లా కలెక్టర్ గా పని చేసిన రోజుల్లో "మన కోసం మనం" అనే కార్యక్రమంతో దాదాపు చాలా వరకు విద్యను అందించానని గుర్తుచేసుకున్నారు. సమాన విద్యా సమానబడి అనే శీర్షికతో సాగిన ఈ కార్యక్రమంలో ఈ మాజీ ఐఏఎస్ తాను చదువుకున్న రోజుల్లో పడిన కష్టాలను గుర్తు చేసుకున్నారు. ఒక రకంగా చూసుకుంటే విద్యలో కింది స్థానం నుంచి మూడో స్థానంలో మన భారతదేశం ఉందని దీనిని అధికమించాలంటే చదువు ఒక్కటే ప్రధాన ఆయుధమని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇక ఈ కార్యక్రమానికి మరో అతిథిగా వచ్చిన నక్క శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. దేశంలో ఉచిత పథకాలు వద్దు, కానీ విద్య, వైద్యం వ్యవసాయం ఈ మూడు ఆయా ప్రభుత్వాలు ప్రజలకు అందించేలా చేస్తే కచ్చితంగా ఆ దేశం మనుగడ పురోగతి చెందుతుంది అని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తన శక్తికి మించి ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని దాదాపు 5 కోట్ల మేర అభివృద్ధి పనులు తాను ఒక్కడినే చేయగలిగితే మిగతా సంఘ సేవకులు ప్రభుత్వం ఇంకా ఎంత చేయాలని ఆయన అధికార ప్రతిపక్ష ప్రభుత్వాలను నిలదీశారు. అలాగే బడి పిల్లలకు ఉచితంగా బట్టలు ఇవ్వడం ఇష్టం లేదని అలా ఇచ్చిన బట్టలు ఒక్క కుట్టు మాత్రమే ఉండి వెంటనే చినిగిపోతున్నాయని ఇలాంటి బట్టలు ఇచ్చిన ప్రయోజనం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిపించే బాధ్యత ముఖ్యంగా తల్లిదండ్రుల బాధ్యత అని ఆయన గుర్తు చేస్తూ ప్రభుత్వం ఒక లక్ష 20 వేల రూపాయలను ఒక్కో విద్యార్థికి ఒక్కో ఏడాది ఖర్చు చేస్తుందని ఆయన గుర్తు చేశారు.

ఇక ప్రముఖ సినిమా స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎల్, ఎం, ప్రేమ్ మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలు అధిక



ఫీజులతో తల్లిదండ్రుల నడ్డి విరుస్తుందని ఇలాంటి కార్యక్రమానికి రావడానికి ఎంతో సంతోషంగా ఉందని కచ్చితంగా 2009 విద్య హక్కు చట్టం అమల్లోకి తీసుకువచ్చి సమాన విద్య హక్కు అందరికీ అందించాలని ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. ఇక ప్రముఖ తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్ సిరిమల్లె విష్ణు కిషోర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఉర్రూతలూగించిన ఎన్నో పాటలను సంగీతం సమకూర్చి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసి విజయానికి కారకులైన నన్ను ఈ ప్రభుత్వం మరిచిపోయిందని అలాగే ఇక చదువుతోపాటు వైద్యం కూడా పూర్తిగా ఖరీదు అయిందని దుయ్యబట్టారు.. ఈ ప్రభుత్వానికి కచ్చితంగా తెలియజేసేలా అనేక కార్యక్రమాలు చేయాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇక ముఖ్యంగా కార్యక్రమాన్ని నిర్వహించిన బాలు చదువులమ్మ చైతన్య యాత్ర ఈరోజుతో ఈ కార్యక్రమం పురుడు పోసుకుందనీ, ఇక తెలంగాణ ప్రతి జిల్లాలో సంచరిస్తూ చదువు సమాన హక్కు, ఇది ప్రతి విద్యార్థికి ఉచితంగా అందాలని తాను ఎదుర్కొన్న ఇబ్బందులను తన కుటుంబ నేపథ్యాన్ని ఆద్యాంతం ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. ఇక పది పాటలను సమకూర్చి సంగీతం అందించిన శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో వ్యవస్థల తప్పు వల్లనే విద్యావ్యవస్థ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా ఖరీదు అయిపోయిందని ఆవేదనను వ్యక్తం చేశారు. దేశంలో అధిక ఫీజులు వసూలు చేసే విషయంలో మన దేశం ముందంజలో ఉందని మాట్లాడిన పెద్దలు ఆవేదనను వ్యక్తం చేశారు. కొంతమంది రాజకీయ పలుకుబడితో మంత్రివర్గంలో చోటు దక్కించుకొని విద్య వ్యవస్థను పూర్తిగా వ్యాపారంగా మార్చి వేశారని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మధు యాష్కి గౌడ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు... రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవిలుని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మీరు నేతృత్వంలో ఖచ్చితంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టండి తన మద్దతు కూడా ఉంటుందని ఆ దిశగా ప్రభుత్వం కూడా పని చేస్తుందని హామీ ఇచ్చారు... మొత్తానికి చదువులమ్మ చైతన్య యాత్ర కార్యక్రమం 10 పాటల రిలీజ్ కార్యక్రమం పూర్తిగా ఆద్యాంతంగా కన్నుల పండుగగా కొనసాగింది. ఒక్కొక్క పాట సమాజాన్ని ఉద్దేశిస్తూ ప్రభుత్వానికి చురకలు పెట్టే విధంగా ఈ పాటలు రాసిన బాలు సభను నిర్వహించి తానేం చెప్పదలుచుకున్నాడో పూర్తిగా బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో సమాజానికి మంచి సందేశాన్ని అందించారు. ఆద్యాంతం సభను ముందుకు నడిపించిన జయభేరి సీనియర్ ప్రతినిధి కడారి శ్రీనివాస్ పాడిన పాట అందరిని ఒకింత ఆలోచింపజేశాయి.. కార్యక్రమం అంతటిలో చదువు అనే అంశం సమాజాన్ని ఆలోచింపజేయాలని తద్వారా విద్య హక్కు చట్టం కచ్చితంగా అమలు పరచాలని పలువురు నేతలు ఆశాభవాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమాన్ని నడిపించిన సీనియర్ జర్నలిస్టు బాలు, జయభేరి సీనియర్ ప్రతినిధి కడారి శ్రీనివాస్, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎల్.యం ప్రేమ్, తెలంగాణ మ్యూజిక్ డైరెక్టర్ సిరిమల్లె విష్ణు కిషోర్, సామాజిక సేవ పరులు నక్క శ్రీనివాస్ యాదవ్, పాటలకు సంగీతం అందించిన శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్టు రమణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు హాజరై సభను విజయవంతం చేశారు.



## నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం

**జయభేరి, మేడిపల్లి :**

శ్రీ వీర అంజనేయుల ఆలయ కమిటీ ఛైర్మన్ రామ్ రెడ్డి ఆధ్వర్యంలో డైరెక్టర్స్ తో కలిసి రాబోయే నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై సమావేశం జరిగింది. మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ.. నవరాత్రి పండుగ సత్యం - అసత్యం పై గెలుపును సూచిస్తుంది అని, ఈ పండుగను వైభవంగా జరుపుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ కి బతుకమ్మ పండుగ ఏర్పాట్ల కోసం వినతిపత్రం సమర్పించారు. అవసరమైన ప్రదేశాలలో లైటింగ్, సౌండ్, గ్రావెల్ వర్క్స్, పటాకుల ప్రదర్శన చేయాలని కోరగా, కమిషనర్ సానుకూలంగా స్పందించి, అన్ని ఏర్పాట్లు గ్రాండ్ సెలబ్రేషన్స్ గా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ శివకుమార్, పీఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి, మాజీ కార్పొరేటర్ అనంత్ రెడ్డి, సీనియర్ నాయకుడు బుచ్చి యాదవ్, మహిళా పీఎంసీ అధ్యక్షురాలు దుర్గ, యువ మండల అధ్యక్షుడు అజయ్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇర్ఫాన్ తో పాటు పలువురు సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలి



**జయభేరి, మల్లాపూర్ :**

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రునగర్ కాలనీ, మల్లాపూర్ గ్రామం సర్వే నెం 43, 44, 45 లోని స్థలానికి సంబంధించి NFC కంపెనీ వారు గతంలో వారు నిర్మించిన ప్రహరీ గోడను కూల్చి, TSIIC మౌలాలి కీ సంబంధించిన మల్లాపూర్ గ్రామా సర్వే నెం 43, 44, 45లో ఖాళీ స్థలములో కొత్తగా ప్రహరీ గోడను నిర్మిస్తున్నారు. ఈ ప్రహరీ నిర్మాణపు పనులను నిలువరించి, అట్టి TSIIC ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం వారు స్వాధీనం చేసుకొని స్థానిక అవసరాల కొరకు స్థానిక కాలనీ వాసులకు ఉపయోగపడే విధంగా అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. అలాగే కేంద్ర ప్రభుత్వ సంస్థ NFC కంపెనీ డిప్యూటీ GM Sridhar Rao, కుషాయిగూడ ఏసిపి వెంకటరెడ్డితో సదారు స్థల విషయమై చర్చించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. నెహ్రూ నగర్ మెయిన్ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఎన్ఎఫ్సీ వారు అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను ఆపాలని అందరినీ కలిసి సమస్యను వివరించారు. ఈ విషయంలో ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించి సహకరిస్తానని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు సాయి జేన్ శేఖర్, నెహ్రు నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఉప్పల్ ఎమ్మెల్యే



**జయభేరి, ఉప్పల్ :**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డ్ వచ్చినా సందర్భంగా కాప్రా మండలానికి చెందిన 13 మందిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా వారికి అభినందనలు తెలిపారు. విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేయాలని ఇలాంటి అవార్డ్ లు మరెన్నో అందుకోవాలి అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో MEO నర్సింహా, స్కూల్ హెడ్ మాస్టర్ అరుణ కుమారి, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ కేతేపల్లి మండల పోటీలు ప్రారంభం

- మార్కెట్ కమిటీ ఛైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి



**జయభేరి, కేతపల్లి, సెప్టెంబర్ 16 :**

కేతపల్లి మండలం లోని డిపాల్ పాఠశాలలో మండల విద్యాధికారి ఆకవరం రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల పోటీలను నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవ రెడ్డి, అతిథులుగా ఎంపీడీవో శ్రీనివాసరావు, కేతపల్లి కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు వంటేపాక రఘు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్. అశోక్ రెడ్డి పుణ్యవతి. ఫాస్టర్ సాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గుప్తా మంజుల మాధవ రెడ్డి మాట్లాడుతూ.. వివిధ క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థిలలో మానసికంగా దృఢంగా ఉంటారని, అందరూ అన్ని పోటీలలో పాల్గొని మంచి క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలని తద్వారా జిల్లా స్థాయికి, రాష్ట్ర స్థాయికి ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అందరికీ శుభాకంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫీడిలు హరిత, నాగయ్య, పిఈటిలు బంటు రవి, మాధవి, సైదులు, మహేష్ ఉపాధ్యాయులు కుషలవరెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటరత్నం, సురేష్ రెడ్డి, నాగయ్య , ఎమ్మార్సీ సిబ్బంది హరికుమార్, సైదులు, సిఆర్ పిలు మల్లయ్య, మహేందర్, మెసెంజర్ రాజేందర్ పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**జయభేరి, సి.బెళగల్:**

సి.బెళగల్ మండల పరిధిలోని బూరందొడ్డి గ్రామానికి చెందిన హరిజన పిలిప్ అనే రైతు అప్పుల బాధ తాళలేక మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రుల నుంచి వచ్చిన రెండు ఎకరాల పొలంతో పాటు, మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, తదితర పంటలను సాగు చేస్తున్నారు. మూడు సంవత్సరాల నుంచి పంటలు చేతికి రాక పోవడంతో దాదాపు 7 లక్షల వరకు పెట్టుబడికి చేసిన అప్పులు మిగిలాయి. అప్పు ఇచ్చిన యజమానులు తీర్చాలని అడగడంతో ఎలా తీర్చాలో తెలియక మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు.పిలిప్ పురుగులు మందు తగిన విషయం గమనించిన కుటుంబీకులు, పిలిప్ ను కోడుమూరు ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు ఫిలిప్ కి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె సంతానం. అప్పుల బాధతో మృతి చెందిన ఫిలిప్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు,గ్రామస్తులు కోరుచున్నారు.

## లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

**జయభేరి, బేతంచర్ల:**

బేతంచర్ల పట్టణంలోని అనధికారికంగా ఉన్న లేవట్లను క్రమబద్ధీకరించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, మంగళవారం తెలిపారు.ప్రభుత్వం కల్పించిన 30062025 లోపు వేసిన అనధికార లేఅవుట్లు అవకాశాన్ని లే అవుట్లు యజమానులు ప్లాట్లు కొనుగోలుదారులు వినియోగించుకోవాలన్నారు. క్రమదీకరణ వల్ల కలుగు లాభాలు చట్టబద్ధమైన భవన నిర్మాణ అనుమతులు విద్యుత్తు నీటి డ్రైనేజీ మౌలిక సదుపాయాలకు కల్పించబడతాయి భవన అనుమతులు ఉంటే బ్యాంకు రుణాలు పొందవచ్చు అన్నారు. అనధికార లేవట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## టీచర్ పై తల్లీకూతురు దాడి

**జయభేరి, బాపట్ల:**

బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. చింతాయపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడిపై తల్లీ, కూతురు దాడి చేశారు. ఈ దాడిని తట్టుకోలేక ఉపాధ్యాయుడు గోడ దూకి పారిపోయాడు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## ఉప ఎన్నికపై బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**



కేటీఆర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి హాజరైన పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్న కేటీఆర్. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ అసమర్థ విధానాల వల్ల నష్టపోయాయని అన్న కేటీఆర్. బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఘన విజయం సాధిస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత 22 నెలలుగా కాంగ్రెస్ పార్టీ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌ను తెలంగాణ ఆర్థిక ఇంజిన్‌గా మార్చిన గత పదేళ్ల తమ ప్రభుత్వ పాలనకు భిన్నంగా, కాంగ్రెస్ పార్టీ విధానాలు నగరాన్ని పూర్తిగా కుప్పకూల్చేలా ఉన్నాయని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ అభివృద్ధి కొనసాగాలంటే భారత రాష్ట్ర సమితి మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని ప్రజలు భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా రేవంత్ రెడ్డి సృష్టించిన భయం కారణంగా హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని, అన్ని రంగాలపై కాంగ్రెస్ అసమర్థ విధానాల ప్రతికూల ప్రభావం తీవ్రంగా ఉందని కేటీఆర్ గుర్తు చేశారు. సమాజంలోని అన్ని వర్గాలు కాంగ్రెస్ అసమర్థ విధానాల వల్ల నష్టపోయాయని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశానికి కేటీఆర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్‌తో చర్చించారు. ఈ ఉప ఎన్నికలో పార్టీ నేతలంతా కలిసికట్టుగా పనిచేసి, జూబ్లీహిల్స్ నుంచి భారత రాష్ట్ర సమితి విజయయాత్రను తిరిగి ప్రారంభించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## పేదల ఇండ్లపై బుల్డోజర్

- కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసిన బాధితులు
- తమ ఇల్లు కూలిస్తే చస్తామంటూ.. పెట్రోల్ పోసుకున్న యువకుడు..
- అధికార పార్టీ నాయకులు 3 లక్షలు డిమాండ్ చేస్తున్నారని బాధితుల అరోపన..

**జయభేరి, మేడిపల్లి :**



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ సర్వే నెం 199 వీకర్ సెక్షన్ కాలనీలో రెవెన్యూ సిబ్బంది అక్రమ నిర్మాణం పేరిట చేపట్టిన పేదల ఇండ్ల కూల్చివేతలు ఉద్రిక్తతకు దారితీసింది. గత 25 ఏండ్ల గా ఇక్కడే నివాసం ఉంటున్నామని మాకు ఈ చిన్నపాటి రేకుల ఇల్లే జీవనాధారం... ఆటో నడిపించుకుంటూ, కూలి పని చేసుకుని కాలం వెళ్లదీస్తున్నాం. మా ఇంటిని కూల్చొదంటూ బాధితురాలు ఇశ్రత్ బేగం,మొహమ్మద్ గౌస్ ల కుమారుడు షానవాజ్ పెట్రోల్ పోసుకొని.. చస్తామంటూ.. హెచ్చరించారు. స్థానిక అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేశ్, కరీం లు మావద్ద రూ. 3లక్షలు డిమాండ్ చేశారని మాకు అంత స్తోమత లేదని కాళ్ళు పట్టుకున్న కనికరించలేదని బాధితులు ఆరోపించారు. డిమాండ్ చేసిన డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో మాపై కుట్రపూరీతంగా తప్పుడు సమాచారం ఇచ్చి మేడిపల్లి మండల రెవిన్యూ అధికారులను ఉసిగొల్పి నిల్వ నీడ లేకుండా చేయడం దుర్మార్గమని వాపోయారు. పేదవారిపైనే మీ ప్రతాపమా అంటూ తమకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.



## నాయీ బ్రాహ్మణ జండా పండుగ ఘనంగా నిర్వహణ

జయభేరి, చర్ల, సెప్టెంబర్ 16 :

మన కుల పరంపర, ధార్మిక ఐక్యతను ప్రతిబింబిస్తూ, నాయి బ్రాహ్మణ దినోత్సవ సందర్భంగా ధన్వంతరి స్వామి ఆశీస్సులతో జండా పండుగను చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా క్రీ.శే.ఉద్దవోలు త్రినాధం అబ్బాయి ఉద్దవోలు రామ్మోహన్ వాజేడు ప్రగతిశీల ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. గడచిన 15 సంవత్సరాలుగా ప్రభుత్వ ఐటీ ఐ కళాశాలలో సేవలందిస్తూ, సమర్ధతతో విద్యార్థులకు మార్గదర్శకత్వం కల్పిస్తూ, సమాజానికి అపార సేవలు అందించినందుకు వారి ప్రతిభను తెలంగాణ ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ ఉద్యోగి అవార్డుతో సత్కరించబడినారు. ఈ అవార్డును డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, మరియు తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ ఐఏఎస్ అందచేశారు.పండుగ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, మహిళా నాయకులు, ప్రముఖ సంఘసభ్యులు పాల్గొని హర్షోద్వేగంగా పాల్గొనగా, త్రినాధం కి ఘనంగా సత్కారం చేయడం జరిగింది. ఈ సందర్బం మా కుల యువతకు, చదువుకునే పిల్లలకి గొప్ప ఆదర్శంగా నిలిచింది.ఈ సందర్భంగా,ధన్వంతరి స్వామి ఆశీస్సుల ద్వారా నాయి బ్రాహ్మణ కుల ఐక్యత, సేవా భావన, విద్యాబోధనలో విజయం సాధించే సంకల్పాన్ని మరింత ప్రబలంగా ప్రతిబింబించుకున్నాం.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శంకర్



జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 16 :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ లో 8వ వార్డు అయ్యప్ప కాలని, ఆర్టీసీ కాలనీలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధుల ద్వారా మంజూరైన 80.0 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. షాద్ నగర్ మున్సిపల్ అభివృద్ధికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, షాద్ నగర్ గ్రంధాలయ కమిటీ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి, నేతలు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, వర్ష గౌడ్, జయ ప్రకాష్, అందే మోహన్, తదితరులు పాల్గొన్నారు...

## డాక్టర్ టంగుటూరి విజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య



జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 16 :

షాద్ నగర్ పట్టణంలోని డాక్టర్ విజయ్ కుమార్ స్వగృహంలో ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందే బాబయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ విజయ్ కుమార్ సమాజ సేవలో పాల్గొంటూ, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని , సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కక్కునూరి వెంకటేష్ గుప్తా, పిట్టల సురేష్ యువ న్యాయవాది కాసోజు శివ , కేశంపేట్ మాజీ మండల అధ్యక్షులు రొల్ల రఘు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సెమినార్ కు KTS విద్యార్థిని



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ రాష్ట్ర మండలి విద్యా పరిశోధన, శిక్షణ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న జాతీయ సైన్స్ సెమినార్ 2025 జిల్లా స్థాయిలో దేవరకొండ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని షాపియా కౌసర్ ప్రదర్శన రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ కు ఎంపికైంది క్వాటం యుగం ఆరంభం అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై జరిగిన సైన్స్ సెమినార్ కు షాపియా కౌసర్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు ఈనెల 18.09.2025 డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, సైన్స్ గోదావరి హాల్ ఎస్ ఇ ఆర్ టి హైదరాబాద్ లో పాల్గొనడానికి అర్హత సాధించింది ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ పాఠశాల కరస్పాండెంట్ సిమర్ల రాజ్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ అన్వర్ హుస్సేన్, ఉపాధ్యాయ బృందం షాపియా కౌసర్ ను అభినందించినారు.

# పేదరికం చిదిమేస్తున్న బాల్యం

## బాల కార్మిక వ్యవస్థ చిట్టి చేతులను చిత్రహింసలు పెడుతుంది

- భారమైన శ్రమకు బలైపోతున్న బాల,బాలికల చేత పలక, బలపం పట్టించాలి
- పిల్లల బంగారు భవిశ్యత్తు కు బాటలు వేయాలి
- పిల్లలతో పని చేయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి
- చిన్న పిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తున్న యాజమాన్యం పై కేసులు నమోదు చేయాలి

జయభేరి, గార్ల, సెప్టెంబర్ 16:





ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో బాల కార్మిక వ్యవస్థ ఒకటి,కార్మికులుగా పనిచేసే 5 నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లల్ని బాలకార్మికులుగా పరిగణిస్తారు, పిల్లలు ఎవరైనా బాలకార్మికులుగా ఉన్నారంటే వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినట్లే. పరిశ్రమలు, వ్యవసాయం, ఇటుక బట్టీలు,నిర్మాణ రంగం, కర్మాగారాలలో, హోటల్స్‌లో, రైల్వే, బస్సు స్టేషన్‌లు, బిక్షాటన, సేవలు సహా అనేక రంగాల్లో బాలలు కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి సరైన విద్య లేకపోవడంతో ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. పోటీతత్వంతో నిండిన సమాజంలో అన్నిరకాలుగా వెనుకబడిపోతున్నారు. పెద్దవారయ్యాక సరైన ఉపాధి దొరకని కారణంగా పలువురు నేరాలకు పాల్పడుతున్నారు. ఉపాధి మార్గాలు వెతుక్కునేందుకు సరైన మార్గదర్శనం, ఆర్థిక తోడ్పాటు లేకపోవడం, నైపుణ్యలేమి వంటి కారణాల వల్లే ఇలా మారుతున్నారు.నేటి బాలలే రేపటి పౌరులు, చిన్నారులే దేశ ప్రగతికి సోపానాలు, కానీ అభివృద్ధిలో పరుగులు పెడుతున్న నేటి హైటెక్ యుగంలోనూ ఇంకా వెట్టిచాకిరి వ్యవస్థ చిన్నారుల బాల్యాన్ని చిదిమేస్తోంది. బాలకార్మిక వ్యవస్థ చిట్టి చేతులను చిత్రహింసలు పెడుతోంది. బాల కార్మిక వ్యవస్థ తీవ్రమైన మానవ హక్కుల సమస్య.

బాలల శారీరక, మానసిక అభివృద్ధికి ఆటంకమై వారికి కనీస అక్షరాస్యతను, వినోదాన్ని కూడా పొందే అవకాశాన్ని ఇవ్వని పనిని, స్థితిని బాల కార్మిక వ్యవస్థ అంటాము. అక్షర జ్ఞానానికి నోచుకోకుండా భారమైన శ్రమకు బలైపోతున్న బాలల జీవితాలు మనం సాధించిన అభివృద్ధిని ప్రశ్నిస్తున్నాయి. బాల కార్మిక వ్యవస్థ ఒక్క భారతదేశ నికే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం బాల కార్మికులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా 2000 నాటికి 246 మిలియన్ల మంది బాల కార్మికులు ఉంటే, 2012 ముగిసే నాటికి 168 మిలియన్ల మంది ఉన్నారు. మొత్తం బాల బాలికల జనాభాలో పదకొండు శాతం మంది బాల కార్మికులే. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికంగా 77.7 మిలియన్ల మంది బాల కార్మికులు ఉన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో బాల కార్మికుల సంఖ్య భారీగా ఉంది. అయితే సబ్ సహారన్ ఆఫ్రికాలో ప్రతి ఐదుగురు బాలబాలికల్లో ఒకరి కంటే ఎక్కువమంది బాల కార్మికులు ఉంటున్నారు. మొత్తం బాల కార్మికుల్లో 85 మిలియన్లు అంటే 5.4% మంది ప్రమాదకర పనుల్లో మగ్గుతున్నారు. ఇప్పటికీ వ్యవసాయ రంగంలోనే అత్యధిక శాతం మంది బాల కార్మికులు ఉన్నారు. ఈ రంగంలో అత్యధికంగా 98 మిలియన్ల మంది బాల కార్మికులు ఉన్నారు. ఆర్థిక మంద్యం, సంక్షోభం వల్ల బాల కార్మికుల సంఖ్య భారీగా పెరుగుతుందని భావించారు. అయితే అందుకు విరుద్ధంగా బాల కార్మికుల సంఖ్య పతనమైంది. దీనికి కారణం బాల కార్మికులు అధికంగా ఉన్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై ఆర్థిక మంద్యం, సంక్షోభం ప్రభావాలు స్వల్పంగా ఉండటం ఒక కారణమైతే, మాంద్యం సమయంలో బాల కార్మికులకు ఉపాధి లభించకపోవడం మరో కారణం.

2001 జనాభా లెక్కల ప్రకారం దేశం మొత్తం మీద 5 నుంచి 14 ఏళ్ల లోపు వయసులో ఉన్న 1.26 కోట్ల మంది బాల బాలికలు ఆర్థిక కార్యకలాపాల్లో బాల కార్మికులుగా ఉన్నారు. వీరిలో 12 లక్షల మంది ప్రమాదకర వృత్తుల్లో ఉన్నారు. 200910లో 514 ఏళ్ల వయసున్న బాల కార్మికుల సంఖ్య 49. 84 లక్షలు. ప్రతి పదిమంది బాల కార్మికుల్లో 9మంది వ్యవసాయ సంబంధిత పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు శారీరక హింసకు గురవుతున్నారు. దాదాపు 50 శాతం మంది ఏదో ఒక రూపంలో భౌతికంగా వేధింపులకు బాధితులవుతున్నారు. బాల కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తారు. కాబట్టి వారికి హక్కులు, కనీస వసతులు మృగ్యమవుతాయి. తేలిగ్గా మోసానికి గురవుతారు. వారికి కష్టానికి తగ్గిన వేతనం లభించదు. శ్రమ దోపిడీకి గురవుతారు. నిర్దిష్ట పనిగంటలు లేవు. పరిశ్రమలు,హీనమైన, హేయమైన వాతావరణంలో బాల కార్మికులు పనిచేస్తున్నారు. ఎంతోమంది పిల్లలు హోటల్లో, దుకాణాలలో, గృహాలలోను సేవకులుగా పనిచేస్తున్నారు. వారి శక్తికి మించి అధిక గంటలు పని చేస్తూ అనేక అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇటుక బట్టీల్లో పనిచేసే పిల్లలు పెద్ద పెద్ద బరువులు మోస్తుంటారు. తరచుగా గాయపడుతుంటారు. కొంతకాలానికి పూర్తిగా శక్తిని కోల్పోతున్నారు. శ్వాస కోస వ్యాధులతో బాధపడుతున్నారు. తివాచీ పరిశ్రమల్లో పనిచేసే బాలలు కంటి చూపు కోల్పోతున్నారు. భవన నిర్మాణ రంగంలో పనిచేసే బాలలు ప్రమాదాలకు గురవుతున్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిషేధించడానికి ముందుగా ప్రాథమిక విద్యను అందుబాటులోకి తేవాలి. అందుకే విద్యను ప్రాథమిక హక్కుగా చేశారు. చట్టం అమల్లో భాగంగా బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం సవాలుగా మారింది.

బాల కార్మిక వ్యవస్థ సంక్లిష్టమైన సామాజిక, ఆర్థిక సమస్య. దీన్ని నిర్మూలించడానికి స్థిరమైన దీర్ఘకాల కృషి అవసరం. చట్టాలు సమగ్రంగా ఉండేలా చూడాలి. ఈ చట్టాలు అమలుకు అవసరమైన పటిష్ట యంత్రాంగం ఉండాలి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన కార్యక్రమాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానించాలి. భారమైన శ్రమకు బలైపోతున్న బాలబాలికల చేత పలక బలపం పట్టించాలి. బాల కార్మిక వ్యవస్థ బాలికల అక్రమ రవాణా,బాల్యవివాహాల నిర్మూలనకు తల్లిదండ్రులు సహకరించాలి. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి పౌరుడు ముందుండాలి,బాల కార్మికులకు విముక్తి కల్పించాలి.

# ఇదే సమస్య మీ ఇంట్లో ఉంటే ఇలాగే వదిలేస్తారా..

- మిషన్ భగీరథ మంచినీటి సమస్యను పరిష్కరించని అధికారుల వైఖరి నశించాలి
- మంచినీటి ట్యాంకులను వృధాగా వదిలేయడం ప్రజా సంపదను లూటీ చేయడమే అవుతుంది

జయభేరి, చర్ల, సెప్టెంబర్ 16 :



చర్ల మండల పరిధిలోని సింగసముద్రం గ్రామాన్ని బహుజన సమాజ్ పార్టీ చర్ల మండల నాయకత్వం మంగళవారం సందర్శించడం జరిగింది. ఆ క్రమంలో అక్కడ ప్రజల యొక్క సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు కొండా కౌశిక్ మాట్లాడుతూ సుమారు 8 సంవత్సరాల నుండీ మిషన్ భగీరథ మంచినీటీ సదుపాయం లేక సింగసముద్రం గ్రామంలోని దాదాపు 100 కుటుంబాల ప్రజలు నానా ఇబ్బందులు ఎదురుకుంటున్నారని ఇందుకు కారణం సంబంధిత అధికారుల నిర్లక్ష్యం మే నని అన్నారు. బాధిత ప్రజానీకం అనేకసార్లు సంబంధిత కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినప్పటికీ ఫలితం శూన్యమని తెలిపారు. మంచినీటి సదుపాయం లేకుండా ఎనిమిది సంవత్సరాల నుండి ఇబ్బంది పడుతున్న ప్రజలకు కనీస మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని తెలిపారు. ఇదే సమస్య మీ ఇంట్లో ఉంటే ఇలాగే వదిలేస్తారని ప్రశ్నించారు. ఊర్లో రెండు ట్యాంకులు ఏర్పాటు చేసినప్పటికి అందులో ఒక ట్యాంకు మంచినీటికీ వినియోగించకపోవడం ప్రజా సంపదను లూటీ చేయడమే అవుతుందని అన్నారు. బాధిత ప్రజానీకం ప్రశ్నించిన ప్రతిసారి ఏదో ఒక సాకుతో వంకలు చెప్పడం అధికారులకు సరైనది కాదని ఆయన మండిపడ్డారు. తక్షణమే ప్రజల పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని నిరుపయోగంగా వున్నా ట్యాంకు కూ ఆమడ దూరంలో ఉన్న మిషన్ భగీరథ మంచినీటి పైపు కలెక్షన్ ఊరిలోకి లాగి ఆ ట్యాంకుకు మంచినీటి సదుపాయాన్ని కల్పించి ప్రజల యొక్క దాహర్తిని తీర్చాలని బహుజన సమాజ్ పార్టీగా డిమాండ్ చేస్తున్నాం అన్నారు. లేనియెడల భారత రాజ్యాంగానికి లోబడి బాధిత ప్రజానీకాన్ని పెద్ద ఎత్తున ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ మండల ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, కోశాధికారి భాష, బాధిత ప్రజానీకం పాల్గొన్నారు.

## ఎలిమినేషన్ లో భరణి, ఫ్లోరా, రీతూ

జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 16 :





కింగ్ నాగ్ సండే ఎపిసోడ్ పూర్తయిన తర్వాత మళ్లీ హౌస్‌లో రెండవ వారం నామినేషన్ ప్రక్రియ మొదలైంది. ప్రతి ఇంటి సభ్యుడు ఇద్దరిని నామినేట్ చేసి, అందుకు తగిన కారణాలు చెప్పి, వారి ఫేస్‌కు రెడ్ పెయింట్ పూయాలని బిగ్ బాస్ చెప్పారు. కెప్టెన్ సంజనని నామినేట్ చేసే ఛాన్స్ లేదని చెప్పారు. మొదటగా తనూజ వచ్చి హరిత హరీష్‌ని నామినేట్ చేసి, నాకు లాస్ట్ వీక్‌లో హరీష్ బిహేవియర్ నచ్చలేదు. మీరు అలా చేయవద్దు, ఇలా చేయవద్దు అని చెప్పిన బిహేవియర్ నచ్చలేదు.. అందుకే నామినేట్ చేస్తున్నాను అని అంటుంది. దానికి హరీష్ వివరణ ఇచ్చాడు.

వారిద్దరి మధ్య చాలా సీరియస్‌గా డిస్కషన్ నడిచింది. నా రెండవ నామినేషన్ ఫ్లోరా శైనీ.. ఎందుకంటే ఏదైనా ఉంటే కలిసి మాట్లాడుకోవాలి అంతే కానీ షాంపూలు, లోషన్లు అన్ని మిక్స్ చేయడమనేది నాకు నచ్చలేదు.. అందుకే నామినేట్ చేస్తున్నాను. ఫ్లోరా తన వాదనకు క్లారిటీ ఇచ్చింది. తర్వాత మనీష్ వచ్చి భరణిని నామినేట్ చేశాడు. మీరు ప్రతి విషయాన్నీ అప్పటికి వదిలేసి.. తర్వాత అందరి ముందు దానిని మళ్ళీ ఎత్తి చూపిస్తున్నారు. అది నచ్చలేదు. అందుకే నామినేట్ చేస్తున్నానని చెప్పాడు. మనీష్ చేసిన ఆరోపణలకు భరణి వివరణ ఇచ్చాడు. రెండో పర్సన్‌గా రీతూ చౌదరిని నామినేట్ చేశాడు మనీష్. తనని ఉద్దేశించి మీరు సరిగ్గా పాత్రలు క్లీన్ చేయడం లేదు.. పర్మిషన్ లేకుండా ఓనర్స్ ఇంట్లోకి వస్తున్నారు.. అందుకే నామినేట్ చేస్తున్న అంటూ రీతూని నామినేషన్ చేశాడు. దీనికి రీతూ సీరియస్‌గా తన వాదనను వినిపించింది. రాంగ్‌గా నామినేట్ చేసినట్లుగా మనీష్‌పై డిఫెండ్ చేసింది. ఇంకా ఎవరెవరు నామినేట్ అవుతారనేది నెక్స్ట్ ఎపిసోడ్‌లో తెలుస్తుంది. నామినేషన్ ప్రక్రియ మాత్రం రచ్చరచ్చగా జరుగుతోంది.



## వీధి కుక్కల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలి

జయభేరి, నేరేడు గోమ్ము :

ప్రతి ఒక్కరూ వీధి కుక్కల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని నేరేడు గొమ్ము మండల వెటర్నరీ డాక్టర్ నర్మద అన్నారు. మంగళవారం నేరేడుగొమ్ము మండలం కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వీధి కుక్కల నుండి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. వీధి కుక్కలు కరవకుండా చూసుకోవాలని, కుక్కలు దాడి చేసే క్రమంలో కింద కూర్చోవాలని, సాధ్యమైనంతవరకు వీధి కుక్కలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఒకవేళ వీధి కుక్కల కాటుకు గురైనప్పుడు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి రేబిస్ వ్యాధికి గురికాకుండా ఇంజక్షన్ చేయించుకోవాలని సూచించారు. వ్యాధులకు గురైన వీధి కుక్కల గురించి తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. వీధి కుక్కల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వం సూచించిన మార్గాలు, జాగ్రత్తలు పాటించినట్లయితే ప్రతి ఒక్కరు వీధి కుక్కల నుండి తప్పించుకోవచ్చని అవగాహన కల్పించారు. అవగాహన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగయ్య, ఉపాధ్యాయుల బృందం ఎస్.రమ్య, ఎన్ చంద్రకుమార్, వి.ఆంజనేయులు, వి.రమేష్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## జనరల్ ఆసుపత్రిలో ఔట్ సౌర్సింగ్ సిబ్బంది అందోళన

జయభేరి, సూర్యాపేట:

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నాకు దిగారు. గత 5 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసారను. సోమవారం కలెక్టరేట్లో తమ సమస్యల మీద విన్నవించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు , తమ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోకును అక్రమంగా అరెస్టు చేశారని.. ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. పెండింగ్లో ఉన్న జీతాలను విడుదల చేయడంతో పాటు ప్రతి నెల 5వ తేదీ లోపే జీతాలను చెల్లించాలని అన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించడంతో ఓపీ సేవలు నిలిచిపోయి, రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు

# అపూర్వ సమ్మేళనం ఒక్కరోజు సెమినార్

- ఉన్నతాధికారుల స్పందించి మూడున్నర ఎకరాల కమ్యూనిటీ హాల్ ఇవ్వాలి
- డబ్ల్యూఏఈసీఏఈఎం, ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ - డీజీసీఈవో చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సీహెచ్ విజయ్ మోహన్ రావు

**జయభేరి, చర్ల, సెప్టెంబర్ 16 :**




చర్ల మండల కేంద్రంలో మంగళవారం ఒక్కరోజు సెమినార్ కార్యక్రమం దైవజనులచే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సీహెచ్ విజయ్ మోహన్ రావు పాల్గొని మాట్లాడారు. మారుమూల ప్రాంతంలో సేవకులు చేస్తున్న సేవలకు అందరి సహకారం అందించాలని డబ్ల్యూఏఈసీఏఈఎం, ఐ ఎన్ హెచ్ ఆర్ ఎఫ్ డీజీసీఈవో చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సీహెచ్ విజయ్ మోహన్ రావు అన్నారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 25 నుండి 30 వరకు చూస్తే మత స్వేచ్ఛ క్రైస్తవులకు వ్యతిరేకంగా మారుతుందని, భారత రాజ్యాంగమును అందరం గౌరవించాలని అన్నారు. భారత పౌరులుగా భారతదేశంలో ఉన్న ప్రభుత్వాల కోసం కేంద్ర ప్రభుత్వం కోసం సేవకులు నిత్యం ప్రార్థనలు చేస్తున్నారని భారతదేశ ప్రజలంతా ఆరోగ్యంగా విద్యావంతులుగా ఉండాలని కోరుతున్నట్లు తెలిపారు. మాకు ఉచిత పథకాలు వద్దని విద్యా ఆరోగ్యం ముఖ్యమైన వని అన్నారు ఈ ప్రాంతంలో అనేకమంది ప్రజలు ఉన్నారని వారిని ఆదుకొనుట చాలా ముఖ్యమని ఈ సెమినార్ ద్వారా తెలియజేశారు. సేవకులంతా ప్రజల కోసం ప్రార్థిస్తున్నారని వారిని ఎవరు కూడా ఆటంకపరచవద్దు అని సేవకులకు సహకరించాలని కోరారు. చర్ల మండలం అటవీ ప్రాంతమైన గిరిజన కుమారుడు జాన్ విక్టర్ ని బిషప్ గా పెంపక చేసినట్లు తెలిపారు. ఈ బిషప్ ని ప్రతి ఒక్కరూ ఆదరించి గౌరవించాలని కోరారు. దుమ్ముగూడెం ములుగు జిల్లాలలో లేవని భద్రాచలం లో 2010లో వరల్డ్ గ్రాములు స్థాపించినట్లు సర్కులేషన్ ప్రకారం 2009లో జాయింట్ కలెక్టర్ మూడున్నర ఎకరాలు ఇచ్చారని తెలిపారు. ఈ సర్క్యులర్లు చూసి గిరిజన ప్రాంతాల్లో ఎందుకు సహాయం చేయట్లేదని ప్రశ్నించారు. కేవలం కమ్యూనిటీ హాల్ మాత్రమే అడుగుతున్నామని వివాహం చేయాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎందుకుగాను ఒక కమిటీ హాల్ ఏర్పాటు చేయాలని అన్ని మండలాల్లో మూడున్నర ఎకరాలు ఇవ్వాలని కోరారు. సరైన స్థలము లేక మరణించిన వారిని రోడ్డు ప్రక్కన గోదారి ఒడ్డున సొంత పొలంలో సమాధి చేసుకుంటున్నారని, విషయాన్ని ఉన్నతాధికారులు మండల రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ గారు గమనించి సహాయం చేయాలని కోరారు మాకు ఉచిత పథకాలు వద్దని, మౌలిక సదుపాయాలు కావాలని ఈ సెమినార్ ద్వారా తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గణిపి పాలరాజు, వైస్ ప్రెసిడెంట్ కే బాబురావు, సెక్రటరీ అడుగుల ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ఇర్పారాజు, ఎగ్జిక్యూటివ్ నెంబర్లు పల్లవి, రవికుమార్, బానారి అనోస్, సారమ్ తిరుపతిరావు, దైవజనులు పాల్గొన్నారు.



# సెప్టెంబర్ 19 న చలో ఇందిరాపార్క్

- పార్టీలకు అతీతంగా ఐక్య లంబాడీల ఆత్మగౌరవ సభ
- లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించం
- ఖబడ్దార్ తెల్లం వెంకట్రావ్ రావు, సోయం బాబు రావు
- అన్నదములుగా ఉంటున్న మా లంబాడీలను ఆదివాసీలను చిచ్చు పెడుతున్న తెల్లం వెంకట్రావ్ సోయంబాబు రావు కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలి
- లంబాడీలు రాజ్యాంగబద్ధంగా ఎస్టీలుగా గుర్తించబడ్డారు
- లంబాడీల ఆత్మగౌరవ సభ కు వేలాదిగా తరలి రావాలని లంబాడి హక్కుల పోరాట సమితి కేశం పేట మండల అధ్యక్షులు జరుపుల రాజు నాయక్
- భారత రాజ్యాంగం అమలులో వచ్చిన రోజు నుండే ఆర్టికల్ 342 ప్రకారం సుగాలి/లంబాడీలు ఎస్టీలుగా గుర్తించబడ్డారు

**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 16 :**

సెప్టెంబర్ 19 ఇందిరాపార్క్, హైదరాబాద్ లో లంబాడీల ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవక గౌరవ సభ ను జయప్రదం చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నది. సుగాలి,లంబాడీ,బంజారాలు ఒక్కటేనని గుర్తించి తెలంగాణలో 20 సంవత్సరాల నష్టపోయిన లంబాడీలను 1976 ఏరియా రిమూవల్ రెస్ట్రిక్షన్ యాక్ట్ ద్వారా ఎస్టీ లుగా రాజ్యాంగబద్ధంగా పార్లమెంట్లో 14 మెజార్టీతో బిల్లు పాసై రాష్ట్రపతి అమోదం ద్వారా గుర్తించబడ్డారని. దీనిపైన తప్పుడు ప్రచారం చేస్తూ రాజ్యాంగబద్ధంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికై అన్నదమ్ముల కలిసి మెలిసి ఉన్న గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ ప్రయోజనంకోసం తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యే భద్రాచలం,, సోయం బాపురావు మాజీ ఎంపీ అదిలాబాద్ లు ఇలాంటి తప్పుడు ప్రచారాలు మనుకోవాలి రాజకీయ లబ్ధి కోసం ఐక్యంగా ఉన్న గిరిజన తెగల మధ్య అనిచ్చితిని, వైరాలను సృష్టిస్తున్నారు ఇలాటి తప్పుడు ప్రచారాలు మానుకోకుంటే ప్రతిఘటన తప్పదు, స్వలాభం కోసమే తెల్లం వెంకట్రావు ఎమ్మెల్యే భద్రాచలం, స్వయం బాబురావు మాజీ ఎంపీ ఆదిలాబాద్ గార్లు లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని వీరి వల్ల గతంలో ఏజెన్సీలో స్థానికన గిరజన నిరుద్యోగులకు 100% ఉద్యోగాలు కల్పించే జీవో 3 నీ కొట్టు వేయడం జరిగిందని, గిరిజన చట్టాలు పాలకులు, అధికారుల నిర్లక్ష్యం అగ్రవర్ణాలు దోపిడి వల్ల 1/70, పెస, 5వ షెడ్యూల్, అమలకు నోచుకోవడం లేదని ఏజెన్సీ ఖనిజ సంపదను దోచుకునే ప్రయత్నంలో ఐక్యంగా ఉన్న గిరిజనుల మధ్య ఘర్షణ వాతావరణం సృష్టిస్తూ వెనుక ఉండి నడిపించే అదృశ్య శక్తులు ఎవరో లంబాడీ సమాజానికి తెలుసని తెల్లం వెంకటరావు సోయంబాబురావు ల వైఖరి పట్ల లంబాడా సమాజం అప్రమంతంగా ఉండాలని రాష్ట్రంలో లంబాడీల పై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నది, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయం పై తమవైఖరి స్పష్టం చేయాలని ఎల్ హెచ్ పి ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 19 ఇందిరాపార్క్ హైదరాబాద్ లో నిర్వహించే లంబాడీల ఆత్మ గౌరవ సభ కు వేలాది మంది లంబాడీ బిడ్డలు పార్టీలకు అతీతంగా విద్యార్థులు , యువకులు, మేధావులు, ఉద్యోగాలు పాల్గొనాలని పిలుపునిచ్చిన కేశంపేట మండల అధ్యక్షుడు రాజు నాయక్.

# మూగ జీవుల దొంగల ముఠా అరెస్ట్

- పగటిపూట రెక్కీ నిర్వహించి మేకలు, గొర్రెలు దొంగతనం
- లక్షల నగదు, వాహనాలు, ఫోన్లు స్వాధీనం
- మీడియా సమావేశంలో షాద్ నగర్ ఏసిపి ఎస్. లక్ష్మీనారాయణ వెల్లడి
- దొంగతనాన్ని ఛేదించిన షాద్ నగర్ పోలీసులు

**జయభేరి, షాద్ నగర్, సెప్టెంబర్ 16 :**



సరదాల కోసం షికార్లు కొడుతూ ఎక్కడ గొర్రెలు మేకలు కనిపిస్తే వెంటనే మట్టు మాయం చేయడం. సరదాలు తీర్చుకోవడానికి జియాగూడ మార్కెట్ కు తీసుకువెళ్లి అమ్మడం. దొంగతనాలకు అలవాటు పడ్డ యువత ఒక ముఠాగా మారి చేస్తున్న ఈ ఆగడాలకు షాద్ నగర్ పోలీసులు చెక్ పెట్టారు. వివిధ చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ ముఠా వివరాలను ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్ మీడియా సమావేశంలో వెల్లడించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలంతో పాటు, కర్ణాటక , హైదరాబాదులోని పహాడీ షరీఫ్ ప్రాంతానిలకు చెందిన మహమ్మద్ ఫిరోజ్ , అబ్దుల్ కలీం, మొహమ్మద్ సోహెల్ ,షేక్ రవూఫ్, మహమ్మద్ జమీర్, మహమ్మద్ ఆరిఫ్ , షేక్ హసీనుద్దీన్, కోయల్ కార్ సాయికిరణ్ లు ఈ దోపిడీ ముఠాలోని నిందితులు. షాద్ నగర్ పరిధిలో చించోడులో 28, వెలిజర్లలో 8, చౌదరిగుడాలో 8, ఎల్కిచర్లలో 23, కొందుర్గు మండలం తంగెడపల్లిలో 8, వెంకిర్యాలలో 9, పరిగి మండలంలో కోటివాడలో 12, సుల్తాన్ పూర్ లో 30, దోమ మండలం వుదంతారావు పల్లి లో 15, జధిరసం పల్లిలో ఆరు మేకలు, గొర్రెలను దొంగిలించారు. ఇదే రీతిన ఈనెల 14వ తేదీన పురపాలక పరిధిలోని సోలిపూర్ వద్ద దొంగతనానికి పాల్పడుతుండగా షాద్ నగర్ పోలీసులు పట్టుకున్నారు. శంషాబాద్ డిసిపి రాజేష్ పర్యవేక్షణలో సాగిన ఈ విచారణ సిపిఎస్ డిసిపి ముత్యంరెడ్డి, అడిషనల్ డీసీపీ పూర్ణచంద్రరావు, శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, శ్రీలక్ష్మి ల నేతృత్వంలో విచారణ కొనసాగింది. షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ సిఐ వెంకటేశ్వర్లు లో ఆధ్వర్యంలో ఎస్సైలు పవన్ కుమార్, అవినాష్ బాబు, శ్రీనివాస్, భూపాల్, శివారెడ్డి, సిబ్బంది కుమార్, మహేందర్, జాకీర్, నవీన్, రమేష్, రవి, భీమయ్య, రవీందర్, కరుణాకర్, మోహన్ లాల్, జాకీర్, రాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పాఠశాల భవనం
# భయం, భయంగా బడికి..

- పెచ్చులుడుతున్న పాఠశాల పై కప్పులు
- పట్టించుకోని అధికారులు
- చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్న విద్యాశాఖ అధికారులు
- శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి, నూతన భవన నిర్మాణం చేపట్టాలి

**జయభేరి, గార్ల, సెప్టెంబర్ 16:**





మహబూబాబాద్ జిల్లా, గార్ల మండల పరిధిలోని చిన్నకిష్టపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.భారీ వర్షాలకు ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉంది.వెంటనే పాఠశాల భవనంపై అధికారులు దృష్టిసారించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి, నూతన భవన నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పాఠశాల భవనం అత్యంత దారుణంగా ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.దింతో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.ప్రమాదాలు జరిగిన తరువాత జాగ్రత్తలు తీసుకునే కన్నా, ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలనీ విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు విన్నవించుకుంటున్నారు.గోడ ల పైకప్పు యొక్క పై పొరలు పడిపోయి విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోక పోవడం పై ప్రజలు ఆగ్రహిస్తున్నారు.పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుంది. శిథిలావస్థలో ఉన్న పాఠశాలలో ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు అని స్థానిక ప్రజలు కోరుతున్నారు.1991 వ సంవత్సరంలో నిర్మించిన పాఠశాల భవనం కూలిపోయి, ప్రమాదం వాటిల్లే అవకాశం ఉన్నప్పటికీ విద్యాశాఖ ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు పిల్లలను పంపాలంటే భయం వేస్తుందని, ఏ సమయం లో ప్రమాదం జరుగుతుందోనని అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని పిల్లలను బడికి పంపుతున్నామని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని కూల్చివేసి, ప్రమాదం నుండి విద్యార్థులను కాపాడాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా అధికారులు కృషి చేయాలనీ ప్రజలు కోరుతున్నారు.

# సెప్టెంబర్ 22 నుంచి డీఎస్సీ కౌన్సెలింగ్

**జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 16:**

ద్యాశాఖ మొత్తం 16,347 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటన విడుదల చేయగా 3,36,300 మంది నుంచి 5,77,675 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ మెగా డీఎస్సీలో ఏకంగా 49.9% మంది మహిళలు సత్తా చాటారు. అన్నిరకాల పోస్టులకు కలిపి 15,941 మంది ఎంపికయ్యారు. ఇందులో 7,955 మంది మహిళలే ఉండటం.. డీఎస్సీ అభ్యర్థుల తుది జాబితాను ఇప్పటికే విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. విద్యాశాఖ మొత్తం 16,347 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేయగా 3,36,300 మంది నుంచి 5,77,675 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ మెగా డీఎస్సీలో ఏకంగా 49.9% మంది మహిళలు సత్తా చాటారు. అన్నిరకాల పోస్టులకు కలిపి 15,941 మంది ఎంపికయ్యారు. ఇందులో 7,955 మంది మహిళలే ఉండటం విశేషం. మెగా డీఎస్సీని ప్రభుత్వం కేవలం 150 రోజుల్లోనే పూర్తిచేసింది. ప్రాథమిక 'కీ'పై 40 వేల అభ్యంతరాలురాగా.. అన్నింటినీ పరిశీలించి తుది 'కీ' రూపొందించారు.రాత పరీక్షకు 80 శాతం, టెట్‌కు 20 శాతం వెయిటేజీతో ఫలితాలను వెలువరించింది. మొత్తం 69 కేటగిరీల్లో డీఎస్సీ నిర్వహించగా.. వీటిల్లో 9 కేటగిరీల్లో నార్మలైజేషన్‌ను పాటించారు. ఇక ధ్రువపత్రాల పరిశీలన 7 విడతల్లో ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 13 వరకు చేపట్టారు. అలాగే క్రీడా కోటా 3% రిజర్వేషన్ అమలు చేస్తూ పోస్టులను భర్తీ చేసిన తొలి ప్రక్రియ ఇదే కావడం విశేషం. క్రీడా కోటాలో ఎలాంటి రాత పరీక్ష లేకుండా 372 మందికి ఉద్యోగాలు వచ్చాయి.ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీ తుది జాబితాలోని అభ్యర్థుల పోస్టింగ్‌లకు సంబంధించి సెప్టెంబర్ 22 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దసరా సెలవుల్లో 22 నుంచి 29 వరకు కొత్తగా ఎంపికైన అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి, కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. దసరా సెలవుల అనంతరం వీరంతా తమకు కేటాయించిన బడుల్లో చేరనున్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశారు. ఏవైనా సందేహాలుంటే 81250 46997, 93988 10958, 79956 49286, 79957 89286 ఫోన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.



# సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి

**జయభేరి, గార్ల, సెప్టెంబర్ 16:**

తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి,నాటి పోరాటంలో అమరులైన వీరుల స్మారక కేంద్రాలను ఏర్పాటు చేసి,సెప్టెంబర్ 17న విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్,సిపిఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక నెహ్రూ విగ్రహ కూడలిలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భూమి,భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం ఎర్రజెండా నాయకత్వంలో తిరుగుబావుట ఎగురవేసి భూస్వాముల కబంధహస్తాల్లో ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదే అని అన్నారు.అణచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి అప్పటి భూస్వాములు, జాగిర్దారుల భూములు పదిలక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ప్రజలకు పంచడం జరిగిందని తెలిపారు.నేడు దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులుగంగావత్ లక్ష్మణ్ నాయక్,సిపిఐ,సిపిఎం నాయకులు కట్టెబోయిన బిక్షమయ్య,ఉమామహేశ్వర రావు,పల్లెబోయిన లింగయ్య, ధారావత్ వీరన్న, లావుడియా భీముడు, కట్టెబోయిన పిచ్చయ్య,గుగులోత్ సక్రు, సింగు రమేష్,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



**జయభేరి, తుర్కపల్లి, సెప్టెంబర్ 16:**

తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఇంచార్జ్ ఉపాధ్యాయుడు భాశెట్టి విష్ణు ఆధ్వర్యంలో పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో విపరీతంగా కాలుష్యం పెరగడం వల్ల ఓజోన్ పొర పల్చబడుతుందని, దాని కారణంగా అతినీలలోహిత కిరణాలు భూమిపైకి వచ్చి చర్మ క్యాన్సర్లు రావడం ,పంటలు సరిగ్గా పండకపోవడం వంటివి జరుగుతున్నాయని అన్నారు. దీనిని అరికట్టడం కోసం అందరు విధిగా సాధ్యమైనంతవరకు ప్రజా రవాలను వినియోగించుకోవాలని కోరారు. ఏసీల వాడకాన్ని, రిఫ్రిజిరేటర్ల వాడకాన్ని తగ్గించడం మంచిదని, ఒకవేళ వాటిని వాడినట్లయితే ఫైవ్ స్టార్ రేటింగ్ ఉన్నటువంటి వస్తువులను ఉపయోగించాలన్నారు. ప్రతి ఒక్కరు విధిగా కేంద్ర ప్రభుత్వం సూచించినట్లుగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించినట్లయితే కొంతవరకు మనం కాలుష్యాన్ని అరికట్టగలమని ,తద్వారా భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేసా శ్రీనివాసాచారి, పెద్ది బిక్షమయ్య, పలుగుల సతీష్ కుమార్, దూదిపాల జ్యోతి, ముసుకుల సుజాత, శ్రీరామ్ బట్ల మాధురి, బీరవెల్లి హరిత, బండి మధుకర్, రాజమైన అంబాజీ ,ఆదరాసు పల్లి వెంకటలక్ష్మి, భూక్య గోవింద్, సి ఆర్ పి పెద్దాకుల భాస్కర్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



**జయభేరి, భువనగిరి, సెప్టెంబర్ 16:**

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన కోట నర్సమ్మ ఇటీవల మరణించడంతో ఆమె కుటుంబానికి మాజీ జెడ్పిటిసి బోరెడ్డి జ్యోతి అయోధ్య రెడ్డి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోట సురేష్ ,తలారి అశోక్ ,బండారి శ్రీను, ఎడపల్లి మల్లేష్, గడ్డమీది యాదగిరి, జేరిపోతుల బాబు, ఆకుల సతీష్, కోట భాస్కర్ ,కోట ఆంజనేయులు, కోట శంకర్, కోట నరసింహ పాల్గొన్నారు.

# ఏసీబీ స్పెషల్ ఆపరేషన్

- 18 బృందాలతో కొనసాగుతున్న సోదాలు..!

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

హైదరాబాద్‌లో స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది అవినీతి నిరోధక శాఖ. 18 బృందాలుగా విడిపోయిన ఏసీబీ అధికారులు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. విద్యుత్ శాఖలో పలువురు ఉన్నతాధికారులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ రంగంలోకి దిగింది. అందులో భాగంగా హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలతో పాటు వివిధ జిల్లాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లో స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది అవినీతి నిరోధక శాఖ. 18 బృందాలుగా విడిపోయిన ఏసీబీ అధికారులు స్పెషల్ ఆపరేషన్ చేపట్టారు. విద్యుత్ శాఖలో పలువురు ఉన్నతాధికారులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖ రంగంలోకి దిగింది. అందులో భాగంగా హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలతో పాటు వివిధ జిల్లాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.మణికొండలో ఏడీఈగా విధులు నిర్వహిస్తున్న అంబేద్కర్ నివాసం, ఆయన బంధువుల నివాసాలతోపాటు ఆయన విధులు నిర్వహిస్తున్న కార్యాలయంలో సైతం సోదాలు చేపట్టారు. ఉదయం 5గంటల నుంచి నగర వ్యాప్తంగా తనిఖీలు చేస్తున్నారు. పెద్దఎత్తున అక్రమాస్తులు కూడబెట్టారన్న సమాచారంతో మణికొండలో విద్యుత్‌శాఖ అడిషనల్ డివిజనల్ ఇంజినీర్ అంబేద్కర్ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు. వందల కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టినట్టు ADE అంబేద్కర్‌పై గతంలోనే ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. ADE అంబేద్కర్ నివాసం, ఆఫీస్‌తోపాటు బంధువుల ఇళ్లల్లోనూ ప్రస్తుతం సోదాలు కొనసాగుతున్నాయి.



# యూఎస్ కాన్సులేట్‌లో సందడి చేసిన ఎన్టీఆర్.. డ్రాగన్ కోసమేనా?

సినీ ప్రేమికుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్న ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో రానున్న సినిమా శర వేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇటీవల "వార్ 2తో వెండితెరపై సందడి చేసిన ఎన్టీఆర్, ఆ సినిమా ఆశించిన స్థాయిలో ఆడకపోయినప్పటికీ, ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ లో బిజీగా ఉన్నాడు.ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ కర్ణాటకలో జరుపుకున్న ఈ సినిమా, త్వరలో అమెరికాలో కీలక షెడ్యూల్ జరుపుకోనుంది. ఈ విషయాన్ని పరోక్షంగా ప్రకటించారు. హైదరాబాద్‌లోని US కాన్సులేట్ కి ఎన్టీఆర్ ఇటీవల వెళ్లాడు. అమెరికా కాన్సుల్ జనరల్ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ లో ఎన్టీఆర్‌తో దిగిన ఫోటోలను పంచుకున్నారు.

ఆ పోస్ట్‌లో ఎన్టీఆర్‌కు స్వాగతం పలుకుతూ .. "ఎన్టీఆర్ ప్రస్తుతం అమెరికాలో తన రాబోయే ప్రాజెక్ట్స్ షూటింగ్ జరపనున్నారు. ఈ సందర్భంగా అమెరికా-ఇండియా భాగస్వామ్యం, ఉద్యోగావకాశాల సృష్టి, ద్వైపాక్షిక సంబంధాల బలపాటానికి ఇది దోహదం చేస్తుంది," అంటూ రాసుకొచ్చారు. ఇక ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా టైటిల్‌గా "డ్రాగన్" అనే పేరు వినిపిస్తోంది. కానీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ప్రశాంత్ నీల్ భారీ యాక్షన్, మాస్ ఎలివేషన్స్‌కు కేరాఫ్ అడ్రెస్‌గా మారిన దర్శకుడు. ఎన్టీఆర్ లాంటి పెర్ఫార్మర్‌తో ఆయన చేయబోయే సినిమా పట్ల అభిమానుల్లో భారీ అంచనాలున్నాయి.

రుక్మిణి వసంత్ తొలిసారి తెలుగులో నటిస్తున్న సినిమా ఇది కాగా, అమెరికాలో షూటింగ్ జరుపుకుంటున్న తొలి తెలుగు సినిమా కావడం విశేషం. రాజకీయ మరియు వాణిజ్య సంబంధాల పరంగా కూడా ఈ సినిమా ప్రభావం చూపనుంది. ఈ చిత్రం మోషన్ పోస్టర్, ఫస్ట్ లుక్ విడుదలపై అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే విడుదల తేదీపై సమాచారం రావొచ్చని తెలుస్తోంది. ఇది పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ప్రాజెక్ట్ కావడంతో, అభిమానులు, పరిశ్రమ వర్గాలు రెండూ ఈ సినిమాపై ఆశలు పెట్టుకున్నాయి. ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్ ఎంత మాస్ రెస్పాన్స్ తెచ్చుకుంటుందో చూడాలి!

# 'బ్రహ్మరాక్షస'కు రంగం సిద్ధం?



ప్రీప్రొడక్షన్ అంతా పూర్తి చేసి, బౌండ్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేసి, హీరో లేని సన్నివేశాలన్నింటి కోసం ఓ షెడ్యూల్ రాసేసి.. ముందు దాన్ని కంప్లీట్ చేసి, అప్పుడు తీరిగ్గా హీరోని పిలిస్తే.. తేలిగ్గా షూటింగ్ కంప్లీట్ అయిపోతుంది. ప్రస్తుతం దర్శకుడు ప్రశాంత్‌వర్మ ఈ టెక్నిక్‌నే ఫాలో అవుతున్నారట. ఇప్పటికిప్పుడు ప్రభాస్ దొరకడం అసాధ్యం. అందుకే.. ఆయనతో చేయబోతున్న 'బ్రహ్మరాక్షస'(వర్కింగ్ టైటిల్) సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్ మొత్తాన్నీ పూర్తి చేసే పనిలో ఉన్నారట ప్రశాంత్‌వర్మ. ప్రతి షాట్, ప్రతీ సీన్ ప్రీ విజువలైజేషన్, ఏ షాట్ ఎలా తీయాలి? తదితర అంశాలపై కూడా ఆయన పూర్తి క్లారిటీతో ముందుకెళ్తున్నారట. డైలాగ్ వెర్షన్ మినహా స్క్రిప్ట్ వర్క్ అంతా కంప్లీట్ అయ్యిందని సమాచారం. స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రా ఈ సినిమాకు మాటలు రాస్తున్నారని తెలిసింది. ముందు ప్రభాస్ లేని సీన్స్ తీస్తారట. ప్రభాస్ తన సినిమాలను పూర్తి చేసుకొని రాగానే, తక్కువ సమయంలోనే 'బ్రహ్మరాక్షస'ను పూర్తి చేసేయాలనే ప్రణాళికతో ప్రశాంత్‌వర్మ ఉన్నారట. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా లాంఛనంగా మొదలయ్యే అవకాశం ఉంది.

# తన్వా దీయ ఎంత మారిపోయింది..



ముంబై చెందిన మధు శర్మ పౌర్ణమి సినిమా కంటే ముందు హిందీ, మరాఠీ భాషలలో పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అప్పట్లో ఎక్కువగా సెకండ్ హీరోయిన్ పాత్రలలో నటించి పాపులర్ అయ్యింది ఈ ముద్దుగుమ్మ. తమిళంలో గురు పర్వాయ్ సినిమాతో సినీరంగంలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ నార్త్ ఇండియన్ బ్యూటీ.. తొలి సినిమాతోనే మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఈ చిన్నదాని అందానికి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. ఆ తర్వాత తెలుగు సినీరంగంలోకి అడుగుపెట్టింది. విలక్షణ నటుడు జగపతి బాబు హీరోగా నటించిన పాండు చిత్రంలో సెకండ్ హీరోయిన్ గా కనిపించింది ఈ భామ. అలాగే శివాజీ, లయ హీరోహీరోయిన్లుగా నటించిన అదిరిందయ్యా చంద్రం, శ్లోకం, గౌతమ్ ఎస్ఎస్సీ చిత్రాల్లో కీలకపాత్రలు పోషించింది. అల్లరి నరేష్, శశాంక్ సరసన పార్టీలో కనిపించింది. ఆ తర్వాత కొంతకాలం గ్యాప్ తీసుకున్న ఈ బ్యూటీ.. ప్రభాస్ పౌర్ణమి చిత్రంలో మోహిని పాత్రలో నటించింది. తెలుగులో శ్రీహరి హీరోగా నటించిన హనుమంతు, బ్రహ్మ వంటి చిత్రాల్లో నటించింది. తెలుగులో ఆడపాదడపా చిత్రాల్లో నటించిన మధుశర్మ ఆ తర్వాత టాలీవుడ్ కు దూరమై హిందీలో సీరియల్స్ చేస్తుంది. ఇప్పుడు మధుశర్మ భోజ్ పురిలో సినిమాల్లో నటిస్తుంది. అలాగే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా మధుశర్మ లేటెస్ట్ లుక్ చూసి ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్.

# దిశా పటానీకి భరోసా ఇచ్చిన ముఖ్యమంత్రి..



సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ పట్టణంలో దిశా పటానీ నివాసం ముందు గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. తాజా సమాచారం ప్రకారం, ఈ దాడి వెనక కారణం దిశా సోదరి ఖుష్బూ పటానీ చేసిన వ్యాఖ్యలు అని తెలుస్తోంది. ఓ వర్గ మనోభావాలను దెబ్బతీసేలా ఆమె మాట్లాడడంతో దాడి చేశారని అంటున్నారు. చాలా మంది యూజర్లు గోల్డీ బ్రార్, రోహిత్ గోదారాను గుర్తు చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు, ఎస్ఎస్‌పీ, ఏడీజీ స్థాయి అధికారులు స్వయంగా దర్యాప్తు చేస్తున్నారని కూడా దిశా తండ్రి జగదీష్ తెలిపారు. గోల్డీ బ్రార్, రోహిత్ గొదారా ఈ కాల్పులు తమ పనేనన్నారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసినందుకు ఇలా చేయాల్సి వచ్చిందంటూ ఒక సందేశం కూడా విడుదల చేశారు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని.. భవిష్యత్‌లో మతాన్ని, సాధువులను అవమానిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. అయితే, దీని వెనుక ఎవరున్నారో పోలీసులు ఇంకా స్పష్టం చేయలేకపోయారు. రీసెంట్‌గా దిశా సోదరి తాను అని రుద్రాచార్యపై మాత్రమే కామెంట్స్ చేశానని.. ప్రేమానంద్ మహారాజ్‌పై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని క్లారిటీ ఇచ్చారు. దిశా సోదరి ఖుష్బూ పటానీ మాజీ ఆర్మీ అధికారిణి. ప్రస్తుతం ఆమె ఒక ఫిట్‌నెస్ ట్రైనర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చేసిన కొన్ని వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ పరిణామాలు చోటుచేసుకున్నట్లు సమాచారం.

# మిరాయ్ విజయోత్సవ సభ.. ఆర్‌ఆర్‌ఆర్‌ని మనోజ్ భలే ర్యాగింగ్ చేశాడుగా..!




టాలీవుడ్ రాకింగ్ స్టార్ మంచు మనోజ్ "మిరాయ్" సినిమాతో విలన్‌గా మారి మంచి పేరు తెచ్చుకున్నాడు. తేజ సజ్జా హీరోగా, కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి, రూ. 100కోట్ల మార్క్‌కు చేరువైంది. ఈ సందర్భంగా చిత్ర బృందం విజయవాడలో ఘనంగా విజయోత్సవ వేడుకలు నిర్వహించింది.ఈ వేడుకలో ఏపీ సినిమాటోగ్రఫీ మినిస్టర్ కందుల దుర్గేష్, దర్శకుడు బాబీ కొల్లి, రచయిత బీవీఎస్ ప్రసాద్, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ ఈవెంట్‌లో మంచు మనోజ్ చేసిన ఎమోషనల్ స్పీచ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

"ఈరోజు నేను ఈ వేదిక మీద ఉన్నానంటే, దానికి కారణం మా డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని. చిన్నవాడైనా ఆయన టాలెంట్‌కి నా వందనం. సినిమా రిలీజ్ అయ్యాక నా మనసుకి హత్తుకున్న విషయం ఏంటంటే.. నా అమ్మ నిర్మలాదేవి సినిమా చూసిన తర్వాత నన్ను కౌగిలించుకొని ఏడ్చారు. 'నువ్వు మహావీరుడిలా అదిరిపోయావ్' అని చెప్పారు. ఎన్నో ఏళ్ల తర్వాత మా అమ్మ కళ్లలో ఆనందం చూశాను. ఆ రోజంతా ఫోన్లు చేస్తూ మా బిడ్డ హిట్టు కొట్టాడంటూ చెప్పిన ఆమెను చూస్తే దేవుడికి థ్యాంక్స్ చెప్పక మానలేను," అని చెప్పారు. ఇక ఈ ఇండస్ట్రీలో ఎవడైనా పెద్ద హీరో అవ్వొచ్చు. బ్యాగ్రౌండ్ లేకుండా మౌళి 'లిటిల్ హార్ట్స్'తో హిట్ కొట్టాడు. యాక్టర్ అవ్వాలంటే చిరంజీవి కొడుకో, మోహన్ బాబు కొడుకో కావాల్సిన అవసరం లేదు. టాలెంట్ ఉంటే చాలు. మౌళి రేపు ఏ సినిమా చేసినా, నన్ను అడిగితే, నేను అతని సినిమాలో తప్పకుండా విలన్ క్యారెక్టర్‌గా కానీ, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కానీ చేస్తాను అని హామీ ఇచ్చారు.

మా నిర్మాత టీజీ విశ్వప్రసాద్ మూడు సంవత్సరాలుగా ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనక్కి తగ్గలేదు. ప్రభాస్ హీరోగా ఆయన చేస్తున్న 'రాజాసాబ్' వేరే లెవెల్‌లో ఉంది. అలాగే నా కెరీర్‌లో ఎన్నో ఒడిదొడుకులు వచ్చినా, మీడియా, ఫ్యాన్స్ ఎప్పుడూ నా వెన్నంటే ఉన్నారు అని మనోజ్ చాలా భావోద్వేగంగా మాట్లాడాడు. అదే సమయంలో వేదికపైకి వచ్చిన ఒక అభిమాని మంచు మనోజ్ కాళ్లు మొక్కగా, మనోజ్ తిరిగి అభిమాని కాళ్లకు నమస్కారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మరోవైపు ఈ ప్రత్యేక కార్యక్రమానికి హాజరైన ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు.. హీరోయిన్ రితికాపై ప్రశంసల జల్లు కురిపిస్తూనే ఉన్నారు. ఆ సమయంలో మంచు మనోజ్.. ఆర్ఆర్ఆర్ దగ్గరకు వెళ్లి ఏంటి కథ అంటూ సైగ చేసి పక్కకు లాగగా, ఆ సమయంలో నవ్వులు పూశాయి. ఇందుకు సంబంధించిన వీడియో కూడా నెట్టింట తెగ హల్‌చల్ చేస్తుంది.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**